ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 34.0 । కనిష్ఠం : 25.0
ANDHRAJYOTHY
5
జోగులాంబ గద్వాల జిల్లా వార్తలు
శనివారం 28 జూన్ 2025



కనులవిందుగా..



వర్షాకాలం ప్రారంభం కావడంతో సీతాకోక చిలుకలు గుంపులు గుంపులుగా కనిపిస్తున్నాయి. అందమైన రెక్కలతో చూపరులను ఆకట్టుకుంటున్నాయి. నీటి ప్రాంతంలో తేమను పీల్చుకుంటూ పుష్పాలపై వాలి మకరంధాన్ని ఆస్వాదిస్తూ గాలిలో తేలుతున్నాయి. శుక్రవారం సాయంత్రం కురిసిన చిరు జల్లులకు కొల్లాపూర్ మండలం రామాపురం గ్రామంలో కొండల నడుమ ఉన్న పంట పొలాల్లో సీతాకోక చిలుకలు విహరిస్తున్నాయి. ఈ దృశ్యాన్ని 'ఆంధ్రజ్యోతి' తన కెమెరాలో బంధించింది.

- పెంట్లవెల్లి, (ఆంధ్రజ్యోతి)

క్లిక్.. క్లిక్..



నీతి అయోగ్ డెల్టా ర్యాంకింగ్‌లో

గట్టుకు 5వ స్థానం

- గట్టు బ్లాక్‌కు త్వరలో రూ. కోటి రూపాయల పురస్కారం
- కలెక్టర్ బీఎం సంతోష్ వెల్లడి

గట్టు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): నీతి అయోగ్ తాజాగా విడుదల చేసిన ఆస్పిరేషనల్ బ్లాక్ పోగ్రామ్ 2024- 25 (జనవరి- మార్చి 2025) క్యూ4 డెల్టా ర్యాంకింగ్‌లో గట్టు బ్లాక్ దేశవ్యాప్తంగా గుర్తింపు పొందింది. నీతి అయోగ్ విడుదల చేసిన డెల్టా ర్యాంకింగ్‌లో 5వ స్థానం లభించిందని జోగుళాంబ గద్వాల కలెక్టర్ బీఎం సంతోష్ శుక్రవారం పత్రికా ప్రకటనలో తెలియజేశారు. దేశవ్యాప్తంగా 500 బ్లాక్‌లలో 5వ స్థానంతో పాటు, జోన్- 3లో 2వ స్థానం సాధించిందని వెల్లడించారు. ఈ ప్రగతికి గుర్తింపుగా త్వరలో నీతి అయోగ్ తరఫున గట్టు బ్లాక్‌కు కోటి రూపాయల పురస్కారం అందచేయబడుతుందని తెలిపారు. ఈ ర్యాంకింగ్ నీతి ఆయోగ్ నిర్వహించిన వర్చువల్ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా 500 ఆస్పిరేషనల్ బ్లాక్‌లు పాల్గొన్న సందర్భంలో నీతి అయోగ్ ప్రధాన కార్యాలయంలో ప్రారంభమైన వాల్ ఆఫ్ ఫేమ్‌లో టాప్ ర్యాంక్ సాధించిన బ్లాక్‌ల విజయ గాథలు ప్రదర్శించ బడుతాయన్నారు. ఆస్పిరేషనల్ బ్లాక్‌తో పాటు డిస్ట్రిక్ట్ పోగ్రామ్‌లు దేశాన్ని వికసిత భారత్ 2047 లక్ష్యం వైపు నడిపించేందుకు ఎలా పని చేస్తాయో చూపిస్తుందన్నారు. ఈ ర్యాంకింగ్ 5 ప్రధాన అంశాలకు ఉన్న 39 కీలక పనితీరు సూచికలు ఆధారంగా నిర్ణయించారన్నారు. ఆరోగ్యం, విద్య, వ్యవసాయం, ప్రాథమిక మౌలిక సదుపాయాలు, సామాజిక అభివృద్ధి వంటి అంశాలను తీసుకున్నారని చెప్పారు. గట్టు బ్లాక్ యొక్క కంపోజిట్ స్కోర్ 61.24 నుంచి 69.43కు పెరిగి 8.19 శాతం అభివృద్ధిని నమోదు చేసిందన్నారు. ఈ ఘనతకు అందరి సమిష్టి కృషి ఫలితంగా సాధ్యమైందని కలెక్టర్ అభినందించారు.



నాగర్‌కర్నూల్‌లోని వైద్య కళాశాల భవనం



జోగుళాంబ గద్వాలలోని వైద్య కళాశాల భవనం



నిర్మాణంలో ఉన్న వనపర్తి వైద్య కళాశాల భవనం

వైద్య విద్య.. మిథ్య

ఆంధ్రజ్యోతి విజిట్

- ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ వైద్య కళాశాలల్లో అధ్యాపకుల కొరత
- మహబూబ్‌నగర్‌లో పాటించని సమయపాలన
- నారాయణపేటలో భవనం మంజూరైనా పిలవని టెండర్లు
- నాగర్‌కర్నూల్‌లో నిర్మాణం పూర్తయినా ప్రారంభించని వైనం
- వనపర్తిలో సా..గుతున్న పనులు
- అద్దె హాస్టళ్లతో పాట్లు
- పాములు, తేళ్లతో భయాందోళన

పూర్తి స్థాయిలో లేని అధ్యాపకులు, సిబ్బంది.. పరికరాలు లేని ల్యాబ్‌లు.. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల్లోని ఐదు వైద్య కళాశాలల్లో నెలకొన్న సమస్యలివీ.. ఫలితంగా ఎంతో ఉన్నత లక్ష్యంతో ఏర్పాటు చేసిన కళాశాలలు అలంకార ప్రాయంగా మారాయి.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మంజూరైన మొట్టమొదటి మహబూబ్‌నగర్ వైద్య కళాశాలకు పూర్తి స్థాయిలో పోస్టులు కేటాయించ లేదు. నారాయణపేట జిల్లా వైద్య కళాశాలకు సొంత భవనం లేకపోవడంతో జిల్లా ఆస్పత్రి భవనంలో నిర్వహిస్తుండగా, విద్యార్థుల హాస్టల్స్‌ను అద్దె భవనాల్లో కొనసాగిస్తున్నారు. వనపర్తిలో వైద్య కళాశాల భవనం నిర్మాణంలో ఉండటంతో నర్సింగ్ కళాశాల భవనంలో నిర్వహిస్తున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో భవన నిర్మాణం పూర్తయినా.. పరిపాలనాపరమైన అనుమతులు రాకపోవడంతో ప్రారంభోత్సవానికి నోచుకోవడం లేదు. జోగుళాంబ గద్వాలలో విద్యార్థులకు మాత్రమే హాస్టల్ వసతి ఉండగా, విద్యార్థినులకు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మెడికల్ కాలేజీల్లో వసతులను మెరుగుపరిచేందుకు కలెక్టర్లు వాటిని తనిఖీ చేయాలని ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోని ఐదు వైద్య కళాశాలలను 'ఆంధ్రజ్యోతి' శుక్రవారం విజిట్ చేసింది. ఈ సందర్భంగా వెలుగు చూసిన సమస్యలపై కథనం..

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం)/ నారాయణపేట/నాగర్‌కర్నూల్/వనపర్తి వైద్య విభాగం/గద్వాల క్రైం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ఐదు వైద్య కళాశాలలు సమస్యలకు నిలయంగా మారాయి. ఖాళీలతోపాటు.. కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మహబూబ్‌నగర్ మెడికల్ కాలేజీలో ప్రొఫెసర్, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులతో పాటు ఇతర వైద్య సిబ్బంది కలిపి 254 పోస్టులు ఉండాలి. కానీ ప్రస్తుతం 126 మందే పని చేస్తున్నారు. ఆర్ఎంవో, క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్ పోస్టులే లేవు. సూపర్ స్పెషాలిటీ పోస్టులు కూడా లేవు.

అలంకారప్రాయంగా ల్యాబ్‌లు..

కళాశాలలో 23 విభాగాలకు 8 విభాగాలకు ల్యాబ్‌లు ఉండగా, ఒక్క ల్యాబ్‌లో కూడా పరీక్షల వస్తువులు, పరికరాలు, రీఏజెంట్స్ లేవు. హిస్టోప్యాథాలజీ ల్యాబ్‌లో ఎక్స్ ఫార్మా సాఫ్ట్‌వేర్ లేకపోవడంతో ల్యాబు వృథాగా మారింది. స్కిల్ డెవలప్‌మెంట్‌కు సంబంధించిన గదిని గత మూడు నాలుగు నెలలుగా తెరవడం లేదని విద్యార్థులు చెబుతున్నారు. శవ పరీక్షల గదిలో ప్రస్తుతం 8 మృతదేహాలు ఉన్నాయి. వాటిని సరైన పద్ధతిలో భద్రపరచాల్సి ఉండగా, ఓ ట్యాంకులో పారవేశారు. శరీర భాగాలను కూడా రసాయన పరికరాలలో కాకుండా ఇళ్లలో వాడుకునే బకెట్లలో ఉంచారు. ఉన్నతాధికారులు, సిబ్బంది ఎవరూ సమయపాలన పాటించడం లేదు.

వసతులు ఏవీ?

కళాశాలలో కనీస వసతులు కరువయ్యాయి. దాదాపు 1,255 మంది వరకు ఉన్న కళాశాలలో ఆడిటోరియం, గ్రౌండ్ లేవు. 875 మంది ఎంబీబీఎస్ విద్యార్థులకు గాను ఎన్ఎంసీ ప్రకారం 75 శాతం మందికి హాస్టల్ వసతి కల్పించాలి. కానీ 450 మందికి మాత్రమే హాస్టల్ వసతి ఉంది. పీజీలు 90 మంది, బీఎస్సీ అలైడ్ సైన్సెస్ విద్యార్థులు 210 మంది, పారామెడికల్ బోర్డు విద్యార్థులు 80 మంది చొప్పున 380 మంది విద్యార్థులకు హాస్టల్ వసతి లేదు. మెస్ పరిస్థితి కూడా అంతంత మాత్రంగానే ఉంది.

భవనం మంజూరైనా పిలవని టెండర్లు

నారాయణపేటలో మెడికల్ భవనం నిర్మాణం కాకపోవడంతో జనరల్ ఆస్పత్రి భవనంలో కళాశాలను నిర్వహిస్తున్నారు. కళాశాలలో 95 పోస్టులకు 38 మంది మాత్రమే విధుల్లో ఉన్నారు. హెచ్ఆర్ఏ స్థానికంగా తక్కువగా ఉండటంతో ప్రొఫెసర్స్, అసిస్టెంట్ ప్రొఫెసర్స్ ఇక్కడికి వచ్చేందుకు ఆసక్తి చూపడం లేదు. ప్రస్తుతం ఆపరేషన్ థియేటర్లు రెండు మాత్రమే ఉన్నాయి. మరో రెండు థియేటర్ల ఏర్పాటుకు మెటీరియల్ వచ్చినా.. ఏర్పాటులో జాప్యం జరుగుతోంది.

ఐదు కేడావర్ల(మృతదేహాలు)కు గాను రెండు మాత్రమే విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయి. పోస్టుమార్టం గది లేక పట్టణంలోని పాత నిరుపయోగంగా ఉన్న జిల్లా ఆస్పత్రిలోని మార్చురీ గదినే వినియోగిస్తున్నారు.

తొలి సంవత్సరం 50 మంది విద్యార్థులు

మెడికల్ కాలేజీ గత ఏడాది ప్రారంభమైంది. మొదటి సంవత్సరంలో 50 మంది విద్యార్థులు కౌన్సెలింగ్ ద్వారా వచ్చారు.

అదే విధంగా రెండేళ్ల పాటు డిప్లొమా కోర్సులు డయాలసిస్, ఈసీజీలకు సంబంధించి 60 మంది శిక్షణ పొందుతున్నారు. వచ్చే ఆగస్టులో రెండో ఏడాది మరో 50 మంది విద్యార్థులు

(మిగతా 6లో..)

జిల్లాలో ఫాస్ట్‌ట్రాక్ కోర్టు

ఏర్పాటు చేయాలి

- తేజేశ్వర్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి
- విలేకరుల సమావేశంలో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి



తేజేశ్వర్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి

గద్వాల న్యూటౌన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లాలో కేసుల సత్వర పరిష్కారానికి ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరినట్లు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇటీవలే హత్యకు గురైన తేజేశ్వర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లా కేంద్రానికి చెందిన తేజేశ్వర్ హత్య బాధాకరమన్నారు. త్వరగా కేసును ఛేదించిన పోలీసులను ఎమ్మెల్యే అభినందించారు. నిందితులకు త్వరగా శిక్ష పడేలా చూడాలన్నారు. సమావేశంలో జడ్పీ మాజీ చైర్మన్ బండారి భాస్కర్, జిల్లా సీనియర్ నాయకుడు గడ్డం కృష్ణారెడ్డి, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ బాబర్, నాయకులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

అంతకుముందు పట్టణంలోని గంటవీధిలో మృతుడి నివాసానికి వెళ్లిన ఎమ్మెల్యే తల్లిదండ్రులు, తోబుట్టువులను పరామర్శించారు. తేజేశ్వర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఎమ్మెల్యే నివాళులర్పిం చారు.

ఎమ్మెల్యే వెంట వచ్చిన పోలీసు అధికారులు కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ నేరస్తులకు శిక్ష పడటం ఖాయమని చెప్పారు.

పంచాయతీ ఎన్నికలకు

సంసిద్ధమై ఉండాలి

- సమీక్ష సమావేశంలో ఎస్పీ రావుల గిరిధర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలకు ప్రతీ పోలీసు అధికారి సంసిద్ధమై ఉండాలని ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లాలోని పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ... రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి గ్రామంలో సమాచార వ్యవస్థను పటిష్టం చేసుకుని విలేజ్ పోలీస్ ఆఫీసర్ విధానాన్ని తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో ఏ చిన్న సంఘటన జరిగినా వెంటనే సమచారం వచ్చేలా వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రత్యేకంగా పోలీస్ సిబ్బంది క్రమశిక్షణతో ఉండాలని, విధులలో ఇలాంటి నిర్లక్ష్యం వహించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించి నడుచుకోవాలన్నారు. ప్రతీ కేసును పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. కోర్టు డ్యూటీ అధికారి ఇలాంటి ముఖ్యమంత్రి సంబంధిత స్టేషన్ అధికారికి సమాచారం ఇవ్వాలని తెలిపారు. అంతకుముందు పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసుల వివరాలు, పెండింగ్ కేసులో వివరాలను అడిగి తెలుసుకుని త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. డీసీఆర్‌బీ డీఎస్పీ ఉమా మహేశ్వరరావు, డీఎస్పీ వెంకటేశ్వరరావు, సీఐలు శివకుమార్, కృష్ణయ్య, స్పెషల్ బ్రాంచ్ సీఐ నరేష్, డీసీఆర్‌బీ ఎస్ఐ తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

తెలంగాణలో

విప్లవంలా అభివృద్ధి

- నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లురవి



డబుల్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీ డాక్టర్ మల్లురవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వంలో విప్లవంలా అభివృద్ధి జరుగుతున్నదని నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లురవి అన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని ఆయన పేర్కొన్నారు. కల్వకుర్తి మండలం జంగారెడ్డిపల్లి గ్రామంలో జేపీ నగర్ నుంచి వయా తిమ్మారాసిపల్లి జేపీనగర్ టు పోల్కంపల్లి వయా జంగారెడ్డిపల్లి తిమ్మరాసిపల్లి వరకు రూ. 25 కోట్ల 60లక్షలతో నిర్మించే డబుల్ రోడ్డు నిర్మాణానికి కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డితో కలిసి ఎంపీ డాక్టర్ మల్లురవి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జంగిరెడ్డిపల్లిలో జరిగిన సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ కల్వకుర్తి నియోజకవర్గంలో ఎమ్మెల్యే పట్టుదలతో సీఎం సహకారంతో బీటీ రోడ్డు నిర్మాణానికి 600కోట్లు మంజూరు అయ్యాయన్నారు. కల్వకుర్తి నియోజకవర్గాన్ని పెద్దన్నలా నేను, చిన్న అన్నలా ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి అభివృద్ధి పరుస్తామన్నారు. నియోజ కవర్గంలో రోడ్లను అభివృద్ధిపర్చి మెరుగైన రవాణా సౌకర్యం కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. జడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్, కల్వకుర్తి మాజీ సర్పంచ్‌లు బృంగి ఆనంద్‌కుమార్, పసుల సుదర్శన్‌రెడ్డి, పసుల రాజేష్‌రెడ్డి, కల్వకుర్తి మాజీ జడ్పీటీసీ సభ్యులు వెంకటయ్యగౌడ్, అశోక్‌రెడ్డి, నాయకులు సంజీవ్‌కుమార్‌యాదవ్, విజయ్‌కుమార్‌రెడ్డి, లింగారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రవి, రామకృష్ణ, భూపతిరెడ్డి, హనుమానాయక్, బాలు, రమాకాంత్‌రెడ్డి, కొండల్‌ఉన్నారు.

పెండింగ్ భూ పరిహారం బకాయిలు
తక్షణమే చెల్లించాలి
- డీఎల్ఐ కాలువ పనులను పరిశీలించిన ఆర్అండ్ఆర్ కమిషనర్
6

బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్
యుగంధర్‌గౌడ్‌పై దాడి
7

చీరకొంగు బైక్ టైరులో చిక్కుకొని
మహిళ మృతి
7

నేటి నుంచి రాష్ట్ర స్థాయి
కిక్ బాక్సింగ్
- 22 జిల్లాల నుంచి 600 మంది క్రీడాకారులు
7

భూ భారతికి దరఖాస్తుల వెల్లువ

- గద్వాల జిల్లాలో 6092 అర్జీలు
- గద్వాల మండలంలో అత్యధికంగా 1152

గట్టు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): భూభారతి రెవెన్యూ సదస్సులకు జోగుళాంబ గద్వాల జిల్లాలో భూ సమస్యలపై దరఖాస్తులు వెల్లువెత్తాయి. ఈ నెల 3 నుంచి ప్రారంభమైన భూ భారతి రెవెన్యూ సదస్సులు 20తో ముగిశాయి. భూ సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం భూ భారతి చట్టం 2025ను తీసుకవచ్చింది. ఇందులో భాగంగా జిల్లాలో ముందుగా ఇటిక్యాల మండలాన్ని పైలట్ మండలంగా ఎంపిక చేసుకుని ప్రారంభించారు. పైలట్ మండలంలో దాదాపు వివిధ భూ సమస్యలకు సంబంధించి 507 దరఖాస్తులను ప్రజలు అందించారు.

● జూన్ 3న 12 మండలాల్లో ప్రారంభం

జిల్లాలోని గద్వాల మండలం అనంతపురం గ్రామంలో జూన్ 3న కలెక్టర్ బీఎం సంతోష్, అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణలు భూ భారతి రెవెన్యూ సదస్సులను ప్రారంభించారు. ఈ ప్రక్రియ ఈనెల 20తో ముగిసింది. 13 మండలాల్లో నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులకు సంబంధించి మొత్తం 18,788 దరఖాస్తు ఫారాలను రైతులకు అందచేశారు. ఇందులో వివిధ భూ సమస్యలపై 198 రెవెన్యూ గ్రామాల నుంచి 6092 దరఖాస్తులను రైతులు అధికారులకు అందచేశారు.

ఆగస్టు 15లోగా పరిష్కారానికి చర్యలు



జోగుళాంబ గద్వాల జిల్లాలో జూన్ 3నుంచి 20 వరకు నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సులో వివిధ భూ సమస్యలపై మొత్తం 6092 దరఖాస్తులను రైతులు అందచేశారు. వీటన్నింటిని ఆయా మండలాల్లో ఒక టీమ్ ద్వారా గ్రామాలకు వెళ్లి పూర్తి స్థాయిలో దరఖాస్తుల వారిగా పరిశీలన చేస్తాం. భూ భారతి సదస్సుల్లో అధికంగా మిస్సింగ్ సర్వేనంబర్లపై 884 దరఖాస్తులు అందాయి. ఆగస్టు 15లోగా వీటిని పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

- లక్ష్మీనారాయణ, అదనపు కలెక్టర్

● మిస్సింగ్ సర్వే నంబర్లపైనే దరఖాస్తులు

జిల్లాలో నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సులో అధికంగా రైతులు ఆన్‌లైన్‌లో మిస్సింగ్ సర్వేనంబర్లు (ఆన్‌లైన్ రికార్డు)పైనే అధికంగా 884 దరఖాస్తులను సమర్పించారు. సక్సేషన్ కోసం 687, డీఎస్ పెండింగ్ సమస్యపై 596 దరఖాస్తులు, అసైన్డ్ భూముల సమస్యపై 427 దరఖాస్తులు, ఎక్స్‌టేంట్ సమస్యపై 385 దరఖాస్తులు, పెండింగ్ మ్యూటేషన్ కోర్టు ఆర్డర్స్ క్లీయరెన్స్ కోసం 306 దరఖాస్తులు, పట్టాదారు డిటైల్స్ కోసం 269, ఓఆర్‌సీ రాలేదని 246 దరఖాస్తులు, నిషేధిత జాబితాలో తొలగించడానికి 118, ల్యాండ్ నేచర్ కోసం 87, ల్యాండ్ అక్విజేషన్ కోసం 74 దరఖాస్తులు, నిషేధిత జాబితాలో చేర్చడానికి ఒక దరఖాస్తు, 38ఈ సర్టిఫికేట్ రాలేదని 6, ఇతర సమస్యలపై 2006 దరఖాస్తులను నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదుస్సులలో రెవన్యూ గ్రామాల ప్రజలు అధికారులకు సమర్పించారు.



అనంతపురం గ్రామంలో భూ భారతి రెవెన్యూ సదస్సులను ప్రారంభిస్తున్న కలెక్టర్ బీఎం సంతోష్, అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ (ఫైల్)

కొనసాగుతున్న జల విద్యుదుత్పత్తి

ఆత్మకూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : ఎగువ, దిగువ జల విద్యుదుత్పత్తి కేంద్రాల ద్వారా వేగంగా ఉత్పత్తి కొనసాగుతుందని ఎస్ఈ శ్రీధర్ శుక్రవారం తెలిపారు. ఎగువ జూరాల జల విద్యుదుత్పత్తి కేంద్రంలో ఐదు యూనిట్ల ద్వారా 3.059 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి చేపట్టగా, ప్రారంభించిన నాటి నుంచి 64.684 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి చేపట్టినట్లు తెలిపారు. దిగువ జూరాల జల విద్యుదుత్పత్తి కేంద్రంలో ఆరు యూనిట్ల ద్వారా 4.219, ఇప్పటి వరకు 74.613 మిలియన్ యూనిట్లు ఉత్పత్తిని చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఎగువ నుంచి ఆశించిన మేర వరద వస్తున్న కారణంగా అన్ని యూనిట్లను ప్రారంభించి ఉత్పత్తిని కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఇదే స్థాయిలో వరద కొనసాగితే నిర్దేశించిన లక్ష్యాన్ని తొందరలోనే చేరుకునే అవకాశం ఉందన్నారు.

ఉమ్మడి జిల్లా సాగునీటి సాధనపై సదస్సు

పాలమూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా సాగునీటి సాధన కోసం వచ్చే నెల 5వ తేదీన హైదరాబాద్‌లో సదస్సు నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి పాలమూరు అధ్యయన వేదిక జిల్లా కన్వీనర్ యం.రాఘవాచారి, పాలమూరు జిల్లా కన్వీనర్ ఏ.తిమ్మప్ప, కే.సీ వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం, దొడ్డి కొమురయ్య హాలులో ఉదయం నుంచి సాయంత్రం వరకు సదస్సు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఉమ్మడి జిల్లాలో 40 లక్షల ఎకరాల సాగుకు యోగ్యమైన భూమి, కృష్ణ, తుంగభద్ర లాంటి జీవ నదులు, పచ్చని అడవులు, కొండలు, నిరంతరగా శ్రమించే శ్రామికులు ఉన్నారని తెలిపారు. అయినప్పటికీ వలసలు, కరువు, కన్నీళ్లను, అసహజ మరణాలనే ప్రజలకు మిగిల్చిందన్నారు. ఇందుకు సంబంధించిన కరపత్రం 28వ తేదీన జిల్లా కేంద్రంలో విడుదల చేస్తామని తెలిపారు.

బైక్ మెకానిక్ కోర్సులో ఉచిత శిక్షణ

పాలమూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో స్టేట్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (ఎస్‌బీఐ ఆర్‌ఎస్ఈటీఐ) ఉమ్మడి జిల్లాలోని నిరుపేద యువతకు స్వయం ఉపాధిలో ఉచిత శిక్షణ అందజేస్తోందని సంచాలకులు జి.శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పురుషులకు బైక్ మెకానిక్‌లో ఉచిత శిక్షణకు 19-45 ఏళ్ల లోపు వయసు కలిగిన మహబూబ్‌నగర్, వనపర్తి, గద్వాల, నాగర్‌కర్నూల్, నారాయణపేట జిల్లాలకు చెందిన ఆసక్తి కలిగిన వారికి అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. జూన్ 27 నుంచి జూలై 27 వరకు 30 రోజుల పాటు ఉచిత వసతి, భోజన సౌకర్యంతో పాటు యూనిఫామ్స్, టూల్ కిట్ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ధృవపత్రాలు అందజేస్తామన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, ఎస్ఎస్‌సీ మెమో, కులధృవీకరణ పత్రం, మూడు ఫొటోలు జతపరిచి సంస్థ కార్యాలయంలో కలవాలన్నారు. పూర్తి వివరాలకు ఎస్‌బీఐ ఆర్‌ఎస్ఈటీఐ పాత డ్వామా కార్యాలయం బండమీదిపల్లి, పీయూ పక్కన కలవాలన్నారు.

బీసీ వెల్ఫేర్ వసతి గృహంలో ఏసీబీ సోదాలు



హాస్టల్ వార్డెన్‌ను అడిగి తెలుసుకుంటున్న ఏసీబీ సిబ్బంది

అచ్చంపేట టౌన్ జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : అచ్చంపేట పట్టణంలోని బీసీ బాలుర వసతి గృహంలో శుక్రవారం ఏసీబీ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. మహబూబ్‌నగర్ జిల్లా ఏసీబీ డీఎస్పీ సీహెచ్ బాలకృష్ణ ఆధ్వర్యంలో అన్ని శాఖల అధికారులతో కలిసి తనిఖీలు చేపట్టేందుకు వసతి గృహానికి వచ్చారు. వసతి గృహంలో 18రకాల రికార్డులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రధానంగా 2024-25,2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన అన్ని విషయాలను కూలంకషంగా అధికారులు పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించారా, వసతిగృహ పరిసరాల పరిశుభ్రత విద్యార్థుల సంఖ్య, మెనూ పాటించారా అనే అంశాలపై ఆరా తీశారు. రికార్డుల నమోదు ప్రక్రియ న్యాయబద్ధంగా ఉందా లేదా అన్నదానిపై అనేక విషయాల పట్ల దాదాపు ఐదా రు శాఖలకు సంబంధించిన అధికారులు అన్ని కోణాల్లో పరిశీలన చేశారు. సాయంత్రం 5గంటల వరకు పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఏసీబీ డీఎస్పీ సీహెచ్ బాలకృష్ణ మాట్లాడుతూ రికార్డులను నమోదు చేసుకున్నట్లు తెలిపారు. త్వరలో నివేదికలు ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

తనిఖీ బాధ్యత వద్దు

- ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలి
- వ్యతిరేకిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు



మహబూబ్‌నగర్ అర్బన్ కేజీబీవీని తనిఖీ చేస్తున్న డీఈవో ప్రవీణ్‌కుమార్ (ఫైల్)

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలపై సరైన పర్యవేక్షణ లేకపోవడంతో విద్యా ప్రమాణాలు పడిపోతున్నాయి. ఈ క్రమంలో తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలలపై మొగ్గు చూపుతున్నారు. దీన్ని చక్కబెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ప్రభుత్వ పాఠశాలను తనిఖీ చేసేందుకు ఉపాధ్యాయులనే తనిఖీ అధికారులుగా నియమించాలని నిర్ణయం తీసుకుంది. అందుకు సంబంధించి ఉత్తర్వులు సైతం ఇచ్చింది. నియమించబడ్డ ఉపాధ్యాయులు వారికి కేటాయించిన పాఠశాలను నిత్యం తనిఖీ చేసి, పరిశీలించిన అంశాలను ఎప్పటికప్పుడు జిల్లా విద్యాశాఖ అధికారికి నివేదించాలని ఆదేశించారు. కలెక్టర్‌కు అన్ని విషయాలు జిల్లా విద్యాశాఖ అధికారులు వివరిస్తారు. అయితే ఈ నిర్ణయాన్ని ఉపాధ్యాయ సంఘాలు మూకుమ్మడిగా వ్యతిరేకిస్తున్నాయి. ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని కోరుతున్నారు. ఇప్పటికే పలు సంఘాల రాష్ట్ర బాధ్యులు రాష్ట్ర స్థాయిలో విద్యాశాఖ ఉన్నతాధికారులను కలిసి విన్నవించినట్లు సమాచారం. ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకొని పాఠశాల పర్యవేక్షణ కేవలం డీఈవో, డిప్యూటీ డీఈవో, ఎంఈవో, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలను మాత్రమే వినియోగించుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

హెచ్‌ఎంలు ఎలా సహకరిస్తారు..

ప్రభుత్వ పాఠశాలల పర్యవేక్షణకు టీచర్లను నియమిస్తే ఎంఈవో, పాఠశాల హెచ్‌ఎంలు ఎలా సహకరిస్తారని పలువురు ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రస్థాయిలో ఉన్న విద్యాశాఖ అధికారులు దీనిపై మరోమారు ఆలోచించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే ఎంఈవోలు, క్లస్టర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పర్యవేక్షిస్తున్నారు. వారి హోదాలో వీరికి తనిఖీ అధికారులు ఇవ్వడం ఎంతవరకు సమంజసం అంటున్నారు. జీహెచ్‌ఎం పర్యవేక్షణలో కొనసాగుతున్న ఉన్నత పాఠశాలను వారి కంటే కింది క్యాడర్ ఉన్న స్కూల్ అసిస్టెంట్స్‌కు ఇవ్వడంతో వారు ఎలా ఒప్పుకుంటారని, వారు పాఠశాలలో పని చేయకుండా తనిఖీలకు పోతే విద్యార్థులకు పాఠాలు ఎవరు బోధించాలి? ఇప్పటికే చాలా పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉంది. ప్రాథమిక పాఠశాలలో ఎల్ఎఫ్ఎల్ హెచ్‌ఎంలు ఉండగా వీరు స్కూల్ అసిస్టెంట్ క్యాడర్‌లో వెళ్లి తనిఖీలు చేయడం ఎలా సాధ్యం అవుతుంతని పలు ఉపాధ్యాయ సంఘాలు నాయకులు ప్రభుత్వ తీరుపై మండి పడుతున్నారు .

ఉమ్మడి పాలమూరు జిలాల్లో మొత్తం 2,922 పాఠశాలలు ఉండగా, 207 కస్టర్లు ఉన్నాయి. ఇందుకు సంబంధించి 13,398 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. ఇందులో ప్రభుత్వ నిర్ణయంతో తనిఖీల కోసం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 380 మందికి పైగా జిల్లా, మండల స్థాయిలో ఉపాధ్యాయులను తనిఖీ కోసం నియమించాల్సి వస్తోంది. దీంతోపాటు మరో 972 ఉపాధ్యాయ పోస్టు ఖాళీగా ఉన్నాయి. వాటన్నింటిని కలుపుకుంటే మొత్తం 1300 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ అ వడంతో విద్యార్థుల బోధనపై తీవ్ర ప్రభావం పడు తోంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఉపాధ్యా యుల తనిఖీలకు సంబంధించి ఇచ్చే బాధ్యతలను వెంటనే ఉపసంహరించుకోవాలని పలు ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నారు.

డీఈవో, ఎంఈవో పోస్టులను భర్తీ చేయాలి..

పాఠశాల పర్యవేక్షణకు ఉన్నతాధికారు లను నియమించడం మంచిది. బోధన సి బ్బందిని విద్యార్థుల బోధనకే పరిమితం చేయాలి. అలా కాకుండా వీరిని తనిఖీల కు నియమించడం సరికాదు. ఈ విధానం చదువుపై తీవ్ర ప్రభావం చూపుతోంది. దీ న్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలి.

\- వెంకటేష్, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి..



ప్రభుత్వ నిర్ణయం సరికాదు దీన్ని వెంటనే ఉపసంహరించుకోవాలి. ఈ విధానం వల్ల ఉపాధ్యాయుల్లో సీనియర్, జూనియర్ అనే వ్యత్యాసం వస్తోంది. పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఏర్పడుతోంది. విద్యార్థులకు బోధన సరిగ్గా సాగదు.

\- సుధాకర్‌రెడ్డి, పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి

ప్రభుత్వ నిర్ణయం సరికాదు..



ఉపాధ్యాయులు పాఠశాలను తనిఖీ చేయడం వల్ల సీనియర్, జూనియర్ వ్యత్యాసం వస్తోంది. ఎంఈవోలు, క్లస్టర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాఠశాలను తనిఖీ చేస్తున్నారు. కొత్తగా స్కూల్ అసిస్టెంట్స్, ఎస్జీటీలను పాఠశాలలను తనిఖీ చేయిచడం సరికాదు.

\- వై.శ్యాంబాబు, పీఆర్టీయూ తెలంగాణ జిల్లా అధ్యక్షుడు

ప్రభుత్వ వైద్య కళాశాలలో.. అధ్యయన కమిటీ తనిఖీ

- మౌలిక వసతులపై ఆరా



హాస్టల్ విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం) జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ వైద్యకళాశాల, ఆసుపత్రిలో శుక్రవారం ఐఏఎస్‌లతో కూడిన అధ్యయన కమిటీ తనిఖీ చేశారు. కళాశాల లో వసతులు సరిగ్గా లేవని ఎన్ఎంసీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేయడంతో పాటు పలు లోపాలున్నాయని షోకాజ్ నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో ప్రభుత్వం నియమించిన ఈ అధ్యయన కమిటీ తనిఖీ చేసి, నివేదికను తయారు చేశారు. ఈ కమిటీలో ఉన్న రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ డైరెక్ట ర్ వాసం వెంకటేశ్వర్‌రెడ్డి, కలెక్టర్ విజయేందిర బోయి, టీజీఎంఎస్ఐ డీసీ సీఈ రవీందర్, మహబూబ్‌నగర్ వైద్యకళాశాల డైరెక్టర్ డాక్టర్ రమేష్, జనరల్ ఆసుపత్రి సూప రింటెండెంట్ డాక్టర్ సంపత్‌కుమార్ సింగ్ కళాశాలలోని వసతులు పరిశీలించారు. ముందుగా కళాశాల, ఆసుపత్రిలో మంజూరైన పోస్టులు, పనిచేస్తున్న ఫ్యాకల్టీ, ఖాళీలు, అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులు ఎంతమంది ఉన్నారు? ఇంకా ఎంతమందిని ఏఏ నోటిఫికేషన్ల ద్వారా రిక్రూట్ చేయాలనే అంశాలతో పాటు మౌలిక సదుపాయాలు, సౌకర్యాలు, నిర్మాణాలు, బడ్జెట్ వ్యవహారాలు, పడకలు, సీట్ల కేటాయింపులు, డాక్టర్లు, సిబ్బంది హాజరు, ఆరోగ్యశ్రీ కేసులు, ప్రభుత్వం నుంచి వస్తున్న నిధులు, వినియోగం, వంటి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కళాశాలలోని కొన్ని విభాగాలను పరిశీలించారు. ముఖ్యంగా భవనంలో పావురాలు ఎక్కువగా ఉండడం చూసి కళాశాల చుట్టూ మెష్ ఏర్పాటు చేయాలని, వాటి వల్ల శ్వాసపరమైన ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉందని సూచించారు. అదే విధంగా అనాటమి విభాగం గురించి అడిగి తెలుసుకున్నారు. కళాశాలలోని హాస్టల్ భవనాలను చూశారు. ఒకే గదిలో 4, 5 మంది ఉండడం చూసి అసహనం వ్యక్తం చేశారు. అంతేకాకుండా విద్యార్థులతో భోజనం, వసతులు, విద్యా బోధనపై అడిగి తెలుసుకున్నారు. కళాశాలలోని మెస్ వంటగదిని పరిశీలించారు. అక్కడ వెంటిలేషన్ లేకపోవడం చూసి లైట్లు ఏర్పాటు చేసుకోవాలని, నాణ్యమైన భోజనాన్ని అందించాలని, ఆహార పదార్థాలు, వస్తువులు ఎక్స్‌పైరీ చూసి వాడాలని సూచించారు. వంటగదులు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

అక్కడి నుంచి జనరల్ ఆసుపత్రికి వెళ్లి పలు విభాగాలను తనిఖీ చేశారు. అదే విధంగా కొత్తగా నిర్మాణమవుతున్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని సందర్శించారు.

ఐదవ బ్లాకు నిర్మాణం, ఈవీఎం గోదాము తరలింపుపై చర్చించారు. ఏఏ గదుల్లో ఏఏ విభాగాలు ఏర్పాటు చేస్తారనే అంశాలపై అడిగి తెలుసుకున్నారు.

భూ పరిహారం బకాయిలు తక్షణమే చెల్లించాలి

- డీఎల్ఐ కాలువ పనులను పరిశీలించిన ఆర్‌అండ్‌ఆర్ కమిషనర్



డీఎల్ఐ కాలువ మ్యాప్‌ను పరిశీలిస్తున ఆర్‌అండ్‌ఆర్ కమిషనర్ శివకుమార్ నాయుడు

చారకొండ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గోకారంలో డిండి లిఫ్ట్ ఇరిగేషన్ (డీఎల్ఐ) పనులను ఆర్‌అండ్‌ఆర్ కమిషనర్ శివకుమార్ నాయుడు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కాలువతో పాటు రిజర్వాయర్ నిర్మించే స్థలాన్ని ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇప్పటి వరకు జరిగిన పనులు, జరగాల్సిన పనులను సంబంధిత అధికారులు మ్యాపుద్వారా శివకుమార్ నాయుడుకు చూపించారు. రిజర్వాయర్ నిర్మాణం జాప్యానికి గల కారణాలు అడిగి తెలుసుకొన్నారు. పెండింగ్‌లో ఉన్న భూపరిహారాన్ని తక్షణమే నిర్వాసితులకు అందజేయాలని ఆయన ఆదేశించారు. డీఎల్ఐ కాలువ, రిజర్వాయర్ పనుల ప్రగతిపై త్వరలోనే మరోసారి సంబంధిత అధికారులతో పాటు కలెక్టర్‌తో సమా వేశం నిర్వహిస్తామని శివకుమార్ నాయుడు పేర్కొన్నారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా కల్వకుర్తి డీఎస్పీ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్ఐ శంషుద్దీన్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అమరేందర్, డీఎల్ఐ ఈఈ యాదవ్‌కుమార్, డీఈ జ్ఞానేశ్వర్, ఏఈ వాజిత్, చారకొండ, వెల్దండ, అచ్చంపేట తహసీల్దార్‌లు అద్దంకి సునిత, కార్తిక్‌కుమార్, సైదులు, ఆర్ఐలు భరత్ కుమార్, శంకర్‌నాయక్, కాంట్రాక్టర్ రవిందర్‌రావు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య హక్కులను కాలరాశారు


- మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు

వనపర్తి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఇందిరాగాంధీ దేశంలో ప్రజాస్వామ్య హక్కులను కాలరావారని మాజీ ఎమ్మెల్సీ రాంచందర్ రావు విమర్శించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎమర్జెన్సీ వ్యతిరేక దినోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 1975 లో ఇందిరాగాంధీ ప్రభుత్వం విధించిన అత్యవసర పరిస్థితిని వ్యతిరేకిస్తు జూన్ 25న ప్రతీ సంవత్సరం ఎమర్జెన్సీ వ్యతిరేక దినోత్సవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దాదాపు 21 నెలలు నాటి ప్రధాని ఇందిరా గాంధీ దేశంలో అత్యవసర పరిస్థితిని విధించినట్లు గుర్తు చేశారు. ఆ సమయంలో పౌరుల ప్రాథమిక హక్కులు, స్వేచ్ఛలను ప్రభుత్వం హరింప చేసిందని ఆరోపించారు. ఎమర్జెన్సీ సమయంలో నియంత ఇందిరా గాంధీ తన ప్రత్యర్థులను జైలు పాలు చేయడంతో పాటు నానా ఇబ్బందులకు గురి చేశారని గుర్తు చేశారు. ఎమర్జెన్సీ రోజులలో జైలు పాలైన రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ మున్నూరు రవీందర్, అనంతప్ప, లక్ష్మణులను సన్మానించారు. కార్యక్రమంలో నారాయణ, ప్రభాకర్‌రెడ్డి, వెంకటరెడ్డి, శ్రీశైలం, పురుషోత్తంరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, రాజశేఖర్ గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు



ఫర్టిలైజర్ దుకాణాన్ని పరిశీలిస్తున్న ఏడీఏ చిన్నహుసేన్‌యాదవ్

చారకొండ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : నకిలీ విత్తనాలు అమ్మి రైతులను మోసం చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొంటామని ఏడీఏ చిన్నహుసేన్‌యాదవ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏవో తనూజరాజుతో కలిసి ఆయన ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేసి స్టాక్ రిస్టర్లు, లైసెన్సులు, విత్తనాలు, ఎరువులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీలర్లు రైతులకు విత్తనాలు, ఎరువులు విక్రయించినప్పుడు తప్పనిసరిగా రిజిస్టర్‌లో నమోదు చేసి వారికి రసీదులు ఇవ్వాలని అన్నారు. దుకాణాల్లో స్టాక్ బోర్డులను తప్పనిసరిగా పెట్టాలని డీలర్లకు సూచించారు. గ్రామాల్లో నాసిరకం విత్తనాలు సరఫరా చేస్తే వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం అందించాలని అన్నారు. ఆయన వెంట పెంట్లవెల్లి ఏవో వికాస్, డీలర్లు ఉన్నారు.

వైద్య విద్య.. మిథ్య



నారాయణపేటలో జనరల్ ఆస్పత్రి భవనంలో నిర్వహిస్తున్న మెడికల్ కాలేజీ



మహబూబ్‌నగర్ ప్రభుత్వ వైద్య కళాశాలలో శరీర అవయవాలు నిల్వ ఉంచిన బకెట్లు

(5వ పేజీ తరువాయి)

ఆంధ్రజ్యోతి విజిట్

కౌన్సెలింగ్ ద్వారా రానున్నారు.

అద్దె భవనాల్లో వసతి గృహం

సొంత భవనం నిర్మాణం కాకపోవడంతో విద్యార్థులు నారాయణపేట సైన్స్ పార్క్ సమీపంలో అద్దె హాస్టల్ భవనంలో ఉంటున్నారు. దాంతో అక్కడి నుంచి కళాశాల ఉన్న అప్పక్‌పల్లికి రోజూ 22 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోంది. ఇదివరకు హాస్టల్ విద్యార్థులకు ఉన్న ఆర్టీసీ బస్సు బంద్ కావడంతో ఆటోలకు వెళ్తూ, ఇబ్బందులు పడుతున్నారు.

భవనం మంజూరైనా పిలవని టెండర్లు

గత ఫిబ్రవరి 21న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మెడికల్ కళాశాల విద్యార్థులతో సమావేశమైన సందర్భంగా జరిగిన కార్యక్రమంలో రూ.26 కోట్ల వ్యయంతో నర్సింగ్ కళాశాల భవనానికి, రూ.40 కోట్లతో మాతా శిశు సంక్షేమ సంరక్షణ భవనానికి శంకుస్థాపన చేశారు. ఆ రెండు భవనాల పనులు ప్రగతిలో ఉన్నాయి. అయితే రూ.130 కోట్లతో మెడికల్ కళాశాల భవన నిర్మాణానికి సీఎం శంకుస్థాపన చేసినా, ఇంకా టెండర్లు పిలువ లేదు.

నాలుగేళ్లయినా..?

మెడికల్ కాలేజీ వనపర్తి జిల్లాకు మంజూరైనా పనులు ఇంకా కొనసాగుతున్నాయి. మెడికల్ కళాశాలతో పాటు నర్సింగ్ కళాశాల కూడా మంజూరు అయింది. గురువారం 'ఆంధ్రజ్యోతి' విజిట్ చేయగా పలు సమస్యలు దర్శనమిచ్చాయి. 2021లో మంజూరైన కళాశాలకు పర్మిషన్ 2022లో వచ్చింది. నాటి నుంచి ఇప్పటి వరకు మెడికల్ కళాశాల కోసం ఇంకా సొంత భవనం నిర్మాణ పనులు పూర్తి కాలేదు. ఈ ఏడాది సెప్టెంబర్, అక్టోబర్‌లోపు సొంత భవనాన్ని పూర్తి చేసి అప్పగిస్తానని కాంట్రాక్టర్ జిల్లా అధికారులకు తెలిపారు. మెడికల్ కాలేజీ భవనాన్ని వనపర్తి పట్టణ సమీపంలోని మర్రికుం టలో కలెక్టరేట్ దగ్గర నిర్మిస్తున్నారు.

ఈ భవనం పక్కనే నర్సింగ్ కళాశాల, వైద్య విద్యార్థుల హాస్టల్ భవనాలు కొనసాగుతున్నాయి. నర్సింగ్ కళాశాల కోసం నిర్మించిన భవనం లో మెడికల్ కాలేజీని కొనసాగిస్తున్నారు. విద్యార్థుల హాస్టల్ వసతిని కూడా వేర్వేరుగా బీసీ వెల్ఫేర్ భవనం, వైటీసీ భవనంలో కొనసాగిస్తున్నారు. ఇక్కడ నిత్యం పాములు, విష సర్పాలు, తేళ్ల బెడద మెడికల్ విద్యార్థులకు తప్పడం లేదు.

అంతేకాకుండా కళాశాల నుంచి అక్కడికి వెళ్లి రావడానికి విద్యార్థులకు ఎలాంటి వాహన సౌకర్యం లేదు. దీంతో విద్యార్థులే సొంతంగా రెండు బస్సులను ఏర్పాటు చేసుకుని రవాణా సౌకర్యాన్ని కొనసాగిస్తున్నారు.

అంతేకాకుండా బోధన విషయంలో వనపర్తి మెడికల్ కళాశాలలో ఫ్యాకల్టీ లెక్చరర్ల కొరత తీవ్రంగా వేధిస్తోంది.

అన్ని ఉన్నా అల్లుని నోట్లో శని

అన్ని ఉన్నా అల్లుని నోట్లో శని చందంగా తయారైంది నాగర్‌కర్నూల్ వైద్య కళాశాల పరిస్థితి. దాదాపు 168కోట్ల రూపాయల వ్యయంతో మూడేళ్ల క్రితం ప్రారంభించబడిన వైద్య కళాశాలలో భవన నిర్మాణాలన్నీ కూడా పూర్తైనప్పటికీ పరిపాలనపరమైన అనుమతులు రాక ప్రారంభోత్సవానికి నోచుకోలేకపోతున్నాయి. శుక్రవారం 'ఆంధ్రజ్యోతి' విజిట్ చేయగా పలు సమస్యలు దర్శనమిచ్చాయి. వైద్య కళాశాల మంజూరు కోసం 605బెడ్ల సామర్థ్యం గల వసతులు ఉండాల్సి ఉండగా, జిల్లా కేంద్రంలోని ఏరియా ఆసుపత్రిని తాత్కాలిక పెడ్లు నిర్మించి 330బెడ్ల స్థాయికి విస్తృతపరిచారు. ఇక్కడ ఆర్థోపెడిక్, జనరల్ సర్జరీ, ట్యూబక్టమీ, గైనకాలజీ, పీడీయాట్రిక్ సర్జరీలు జరుగుతున్నాయి. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సామర్థ్యం 330 పడకలకే పరిమితం కావడంతో వివిధ రోగాలు, శస్త్రచికిత్సల నిమిత్తం వస్తున్న వారికి అసౌకర్యాలు కలుగుతున్నాయి. మెడికల్ కాలేజ్ కొత్త భవనం నిర్మాణం పూర్తై దాదాపు ఏడాదిగా ప్రారంభోత్సవానికి నోచుకోవడం లేదు. మెడికోలకు ప్రారంభంలో హాస్టల్ వసతి కూడా లేకపోవడంతో పాత కలెక్టరేట్‌లోని రెండవ అంతస్తులో తాత్కాలిక వసతిని కల్పించినప్పటికీ వారు అనేక ఇబ్బందులను ఎదుర్కొన్నారు. కొత్త భవనం నిర్మాణం పూర్తైనప్పటికీ ఇప్పటికీ నర్సింగ్ కాలేజ్ భవనంలోనే మెడికల్ కాలేజ్‌ను కొనసాగించడం...

అక్కడ అనేక అసౌకర్యాలు ఉండడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మెడికల్ కాలేజ్‌కు అనుసంధానంగా కొనసాగుతున్న ఏరియా ఆసుపత్రిలో ప్రతీ రోజు వెయ్యి నుంచి 1200మంది ఔట్‌పేషెంట్లు వస్తున్నారు. వారికి సరైన సౌకర్యాలు కల్పించలేక సరైన రీతిలో వైద్య సేవలు అందించలేక వైద్యాధికారులు ఆపసోపాలు పడుతున్నారు. కనీసం అక్కడ పార్కింగ్ వసతి కూడా లేకపోవడం... సిబ్బంది కూడా పూర్తిస్థాయిలో లేకపోవడం కారణంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయి. విషసర్పాలతో విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు.

గద్వాల మెడికల్ కాలేజీలో ప్రొఫెసర్ల కొరత

జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో గత ఏడాది ప్రారంభమైన మెడికల్ కాలేజీలో ఆధ్యాపకుల కొరతతో పాటు ఇంకా కొన్ని సమస్యలు ఉండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మొదటి సంవత్సరంలో విద్యార్థులకు సమస్యలపై అంత ప్రభావం చూపకపోయినా కూడా రాను, రాను ఈ సమస్యలు ఇలాగే ఉంటే విద్యార్థులు ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. శుక్రవారం 'ఆంధ్రజ్యోతి' విజిట్ చేయగా పలు సమస్యలు కనిపించాయి.

గత ఏడాది ఆగస్టులో ఏర్పాటు చేసిన ఈ మెడికల్ కళాశాలలో మొదటి



విద్యార్థులకు బోధించే తరగతి గది

విడతగా 50 మంది విద్యార్థులకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. అయితే కళాశాల ఏర్పాటు చేశారే కానీ ఇందుకు తగ్గ అధ్యాపకుల కొరతను భర్తీ చేయలేదు. ఇందులో ఉన్న అనాటమి, ఫిజియాలజి, మైక్రోబయాలజీ, బయోకెమిస్ట్రీ, ఫార్మకాలజి తదితర వాటికి సంబంధించి మొత్తం ప్రొఫెసర్లు 29 మంది ఉండాల్సి ఉండగా, కేవలం 14 మంది మాత్రమే ఉన్నారు. అలాగే అసోసియేట్ ప్రొఫెసర్లు 20 మందికి గాను 10 మంది, అసిస్టెంట్ ప్రొఫెసర్లు 25కు గాను 15 మంది ఉన్నారు. దీంతో పాటు ల్యాబ్ టెక్నీషియన్లు 24 మంది ఉండాల్సి ఉండగా ఒక్కరు కూడా లేకపోవడం విడ్డూరం.

మెడికల్ విద్యార్థినులకు కరువైన వసతిగృహ సౌకర్యం

మెడికల్ కాలేజీ విద్యార్థులకు వసతిగృహ సౌకర్యం బాలురకు మాత్రమే ఉండటంతో బాలికలు ఇబ్బందులు పడాల్సి వస్తుండటంతో తాత్కాలికంగా కలెక్టరేట్ సమీపంలో తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. అయితే వీరికై ప్రత్యేకంగా పక్కా భవనం నిర్మించేలా చూడాలని మెడికల్ కళాశాల విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మెడికో విద్యార్థులలో బాలురకు మాత్రం కళాశాల పైభాగంలోనే హాస్టల్ సౌకర్యాన్ని కల్పించడంతో వారికి ఎలాంటి ఇబ్బందులు లేనట్లు ఉన్నాయి. కళాశాలలో ఉన్న 50 మందిలో 98 శాతం విద్యార్థులు హాస్టల్ సౌకర్యాన్ని వినియోగించుకుంటున్నట్లు ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

దీంతో పాటు విద్యార్థులకు ప్రత్యేకంగా ఉండాల్సిన జిమ్, ప్లేగ్రౌండ్ లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. అలాగే మెడికల్ కళాశాలకు అనుబంధంగా ఉన్న ఆసుపత్రిలో రేడియాలజిస్ట్ లేకపోవడంతో ప్రజలు పూ ర్తిస్థాయిలో ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఆసుపత్రిలో అన్ని పరికరా లు పుష్కలంగా ఉన్నా కూడా వాటిని కంట్రోల్ చేసే రేడియాలజిస్ట్ లేకపోవడంతో ఇవి మూలనపడాల్సిన అవసరం ఏర్పడుతుందని డాక్టర్లు వాపోతున్నారు.

బలిదానాల మాసం మొహర్రం

» కనిపించిన నెలవంక
» ప్రారంభమైన ఉత్సవాలు

ఊట్కూర్, జున్ 27 (ఆంధ్రజ్యోతి): హిందూ, ముస్లింల మత సామరస్యానికి ప్రతీకగా కలిసిమెలిసి సోదర భావంతో జరుపుకునే ఏకైక పండుగ మొహర్రం. కుల మతాలకతీతంగా భక్తిశ్రద్ధలతో రాష్ట్ర వ్యాప్తంగా మొహర్రం ఉత్సవాలు పదిరోజుల పాటు జరుగుతాయి. గురువారం నెలవంక దర్శనం ఇవ్వడంతో శుక్రవారం నుంచి మొహర్రం ఉత్సవాలు ప్రారంభం అవుతాయి. రాష్ట్రంలో పదిరోజుల పాటు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా మొహర్రం ఉత్సవాలను ప్రజలు జరుపుకుంటారు. చంద్రవంక దర్శనం ఇవ్వడంతో ముతావలిలు పీర్ల చావడీ ముందు అలై గుంతను తీసి పీర్ల మసీద్‌లో పీర్లను ప్రతిష్ఠిస్తారు. గ్రామగ్రామాన పక్షంరోజుల పాటు అలైగుంత చుట్టు డప్పుదరువుతో అలై ఆడుతూ పాడుతారు. మహిళలు బొడ్డెమ్మలు ఆడడం ఎంతో ఆకర్షణీయంగా ఉంటుంది. విషాదానికి గుర్తుగా ముస్లిం మహిళలు మాథంను పాడుతారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పీర్ల పండుగకు చాలా ప్రత్యేకత ఉంది. ఇక్కడ ప్రజలు గ్రామగ్రామాన పీర్ల ఉత్సవాలను ఎంతో ఉత్సాహభరితంగా జరుపుకుంటారు. ప్రత్యేకంగా జిల్లాలోని కోయిల్‌కొండ బీబీ ఫాతిమా సవారి తర్వాత ఊట్కూర్ మండల కేంద్రంలోని హస్సన్, ఉస్సెన్ సవారిలు ఎంతో వైభవంగా జరుగుతాయి. ఈ ఉత్సవాలకు బతుకుదెరువు కోసం గ్రామాలు వదిలి వలస వెళ్లిన పల్లెప్రజలు మొహర్రం పండుగకు తమ సొంత గ్రామాలకు వస్తారు. కోరిన కోర్కెలు తీర్చే మహిమలు గల అన్నదమ్ములు హస్సన్, ఉస్సెన్‌లకు మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీగా కొనసాగుతూ వస్తోంది. జిల్లాలోని వివిధ ప్రాంతాల ప్రజలు ప్రత్యేక వాహనాల్లో ఊట్కూర్‌కు వచ్చి హస్సన్, ఉస్సెన్‌ల పేర గొర్రెలు, మేక పోతులను కోసి ఫాతెహా(నైవేద్యం) సమర్పిస్తారు. మొక్కుకున్న వాళ్లు, కోరికలు తీరిన వాళ్లు పీర్లకు వెండి, బంగారం గొడుగులు, ఉయ్యాలలు, దట్టీలు సమర్పించుకుంటారు. ఉత్సవాల సందర్భంగా పీర్లను పట్టుకునే వారి శరీరంలో దేవుడు ప్రవేశిస్తాడని వారు చెప్పే మాటలు నిజమవుతాయనే విశ్వాసంతో ప్రజలు పీర్లు లేవగానే దేవుని ముందు నిలబడి తమ కష్ట సుఖాలు వెలబుచ్చుకొని పరిష్కారానికై కోరుకుంటారు. దారి పొడవున పాదాలకు నీళ్లుపోస్తూ పొర్లు దండాలు పెడతారు. ఊట్కూర్ పీర్ల ఉత్సవాల్లో పీర్ల వెంట అగ్ని గుండంలోంచి నడిచి రావడం ఆకర్షణీయంగా ఉంటుంది. పీర్లు పట్టే వ్యక్తుల వంశంలో మగ పిల్లవాడు ప్రతీ సంవత్సరం పుడుతాడు. ఆ పిల్లవాన్ని పీర్ల తొట్లలో వేసి ఉయ్యాల ఊపడం ప్రత్యేకత ఉంటుంది. వందలాదిమంది వివిధ గ్రామాల నుంచి ప్రత్యేక వాహనాలు, బండ్లను కట్టుకువచ్చి గొర్రెపోతులు కోసి పీర్లకు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు. ఈ ఉత్సవాలకు ముంబై, పుణే, షోలాపూర్, భీమండి, రాయిచూర్, గుల్బర్గా, యాద్గీర్, తాండూర్, వరంగల్, కొడంగల్, హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాల నుంచి ప్రజలు తరలివస్తారు. మండలంలో మొహర్రం మాసం ప్రారంభం నుంచి 6, 7వ రోజుల్లో పులిమామిడి, చిన్నపొర్ల గ్రామాల్లో ఖాసీం పీర్ల ఉత్సవాలు, 9వ రోజు నిడుగుర్తి, ఊట్కూర్‌లో జరిగే ఉత్సవాలు, పదో రోజు కోయిల్‌కొండలో జరిగే ఉత్సవాలు ఎంతో వైభవంగా జరుగుతాయి.


ఊట్కూర్‌లో ఉయ్యాల ఊపుతున్న హస్సన్ ఉస్సెన్ పీర్లు (ఫైల్)


ఊట్కూర్‌లో ప్రతిష్ఠించిన హస్సన్, ఉస్సెన్ పీర్లు (ఫైల్)

విషాదంలో ముస్లిం సమాజం

ఇస్లామిక్ క్యాలెండర్ ప్రకారం సంవత్సరంలో మొదటి మాసం మొహర్రం. ఈ మాసంలో ధర్మరక్షణ కోసం ఎందరో మృతి చెందారని దీనిని విషాద మాసంగా ప్రకటించారు. దీంతో ఈ మాసంలో ఎలాంటి నూతన సంవత్సర వేడుకలు కానీ, శుభకార్యాలు గానీ జరుపరు. అందరూ విషాదం పాటిస్తారు. మొహర్రం మాసంలోని 9, 10 తేదీల్లో ముస్లింలు ఉపవాసాలు నిర్వహిస్తారు. మొహర్రం సందర్భంగా షీయా వర్గానికి చెందిన వారు ఉత్సవాల్లో ఎదపై బ్లేడులతో గాట్లు పెట్టుకొని యా హుస్సేన్.. యా హసన్ అని మాథం పెడుతూ ఊరేగింపు నిర్వహిస్తారు. ఇది మన రాష్ట్రంలోని హైదరాబాద్‌లో ప్రధానంగా కన్పిస్తుంది.

క్రైం కార్నర్

చీరకొంగు బైక్ టైరులో చిక్కుకొని మహిళ మృతి


శృతి (ఫైల్)

కల్వకుర్తి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : చీర కొంగు బైకు టైరులో పడి ఓ మహిళ మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఎస్‌ఐ మాధవరెడ్డి కథనం ప్రకారం... కల్వకుర్తి పట్టణానికి చెందిన బండపల్లి రవి అతని భార్య శృతి(22) పిల్లలు కొల్లాపూర్‌కు బైక్‌పై వెళ్లి తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో కల్వకుర్తి-నాగర్‌కర్నూల్ రోడ్డులో రైస్ మిల్లు సమీపంలో చీర కొంగు బైక్ టైరులో ఇరుక్కుని కింద పడిపోయింది. తీవ్రంగా గాయపడిన శృతిని వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మృతి చెందిందిన ఎస్‌ఐ తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో..

తిమ్మాజిపేట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మెంట అంజనమ్మ(65)గ్రామ సమీపంలోని మేల కుంటలో పడి మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. ఆమె మృతిపై కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేశారు. అంజనమ్మకు ముగ్గురు కుమారులు. రెండవ కుమారుడు పరశురాములు భార్య విషయమై కొంతకాలంగా ఇరు కుటుంబాల మధ్య సఖ్యత లేదు. ఈ నెల 23న మృతురాలి కోడలు విషయమై పంచాయితీ నిర్వహించేందుకు కోడలి తరఫు బంధువులు పోతిరెడ్డిపల్లికి వచ్చారు. ఈ సమయంలో కోడలి బంధువులు మా అమ్మను దూషించడం వాళ్లని మనస్తాపన చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు పెద్ద కుమారుడు మెంటల్ వెంకటేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు.

రెండు బైక్‌లు ఢీ : ఐదుగురికి గాయాలు

వడ్డేపల్లి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఐదుగురు గాయపడ్డారు. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ప్రమాదం జోగుళాంబ గద్వాల జి ల్లా వడేపల్లి మండలం జూలక ల్లు స్టేజీ సమీపంలో శుక్రవా రం చేటుచేసుకుంది. స్థానికుల తెలిపిన వివరాలు ఇలా.. తనగ ల గ్రామానికి చెందిన యాకో బు కర్నూలు నుంచి భార్య, కుమారుడితో బైక్‌పై బయలుదే రాడు. జూలకల్లు స్టేజీ వద్దకు రాగానే జూలకల్లు గ్రామ శివాలయం నుంచి వస్తున్న రాజేష్, కటికె ఖాజా బైక్ ఢీకొన్నాయి. దీంతో యాకోబు కుమారుడు, జూలకల్‌కు చెందిన రాజేశ్ తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు 108అంబులెన్స్‌లో వారిని కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వ్యక్తి అదృశ్యం: కేసు నమోదు


అబ్దుల్ హాజీ

మానవపాడు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడుకు చెందిన అబ్దుల్ హాజీ నాలుగు నెలలుగా కనిపించకుండా పోయాడని ఆయన భార్య తస్లీంబేగం శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు తెలిపారు. అబ్దుల్ హాజీ (48) గతంలో పదిసార్లు ఇంటి నుంచి బయటికి పోయి కొన్నిరోజులకు తిరిగి వచ్చేవాడని, ఎందుకు ఇంటినుంచి వెళ్తున్నవని ప్రశ్నిస్తే సమాధానం ఇచ్చేవాడుకాదని తెలిపారు. గతంలో మాదిరి ఈసారి కూడా వస్తాడని ఎదురుచూశామని, నేటి వరకు కూడా రాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.

విద్యుత్ వైర్లకు తగిలిన బోరు బండి

» తప్పిన ప్రమాదం

కృష్ణ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రివర్స్ తీసుకుంటూ విద్యుత్ వైర్లు తగిలిన బోరు బండికి ప్రమాదం తప్పిన సంఘటన నారాయణపేట జిల్లా కృష్ణ మండల కేంద్రంలో శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. మండల కేంద్రానికి చెందిన బోరు బండి వాహనం తిరిగి వెళ్లేందుకు కనకదాస విగ్రహం ముందు వాహనం రివర్స్ తీసుకుంటుండగా పైన ఉన్న విద్యుత్ వైర్లు తగిలాయి. దీంతో మంటలు వచ్చి విద్యుత్ వైర్ తెగి కింద పడ్డాయి. వెంటనే బోరు బండిపై ఉన్న కార్మికుడు కిందకు దూకడంతో ప్రమాదం తప్పింది. వాహన యజమాని సబ్‌స్టేషన్‌కు సమాచారం అందించి విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. లైన్‌మెన్ చేరుకుని వైర్లు మరమ్మతులు చేశారు.

ఇసుక టిప్పర్, డోజర్ పట్టివేత

కృష్ణ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): డంపు చేసిన ఇసుకను తీసుకువెళ్తున్న టిప్పర్, డోజర్‌ను తహసీల్దార్ శ్రీనివాస్ పట్టుకున్నారు. నారాయణపేట జిల్లా కృష్ణ మండలం హిందూపూర్ గ్రామ రైల్వే అండర్‌గ్రౌండ్ బ్రిడ్జి పక్కన ఇటుకల బట్టీ వద్ద డంపు చేసి ఉంచారు. ఇక్కడ డంపు చేసిన ఇసుకను కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లా దేవసుగురుకు చెందిన టిప్పర్, ఇసుక నింపుతున్న డోజర్‌ను శుక్రవారం తహసీల్దార్ శ్రీనివాస్, సిబ్బంది పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనుమతి లేకుండా ఇసుకను తరలించే వారిపై చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ శ్రీనివాస్ హెచ్చరించారు.

బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ యుగంధర్‌గౌడ్‌పై దాడి


ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న రాచాల యుగంధర్‌గౌడ్

కొత్తకోట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : బీసీ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్‌పై గుర్తుతెలియని దుండగులు దాడి చేశారు. గురువారం రాత్రి వనపర్తి జిల్లా కొత్తకోట నుంచి ఆయన స్వగ్రామం వడ్డెవాటకు కారులో వెళ్తుండగా దుండగులు అడ్డగించి రాళ్లతో దాడి చేశారు. డ్రైవర్ రాజు చాకచక్యంగా కారును ముందుకు తీసుకెళ్లడంతో ప్రమాదం తప్పింది. వాహన అద్దం మాత్రం పగిలింది. గ్రామ సమీపానికి వెళ్లి రాచాల 100కు ఫోన్ చేయడంతో పోలీసులు వచ్చారు. ఘటనా స్థలం సమీపంలో గాలించగా నిందితుల ఆచూకీ లభించలేదు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకొని శుక్రవారం డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆరు బృందాలు విచారణ చేపట్టాయి. రాచాలతో పాటు డ్రైవర్ రాజును డీఎస్పీ విడివిడిగా విచారించారు.

ఎస్పీకి ఫిర్యాదు

వనపర్తి, (ఆంధ్రజ్యోతి): తనపై చేసిన దాడిని ఖండిస్తు శుక్రవారం ఎస్పీ రావుల గిరిధర్‌కు బీసీ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ ఫిర్యాదు చేశారు. అనంతరం ఎస్పీ కార్యాలయం బయట విలేకరులతో మాట్లాడారు. తాను కొన్నేళ్లుగా అనేక సమస్యలపై పోరాటం చేస్తున్నానని, ఇది నచ్చక కొందరు తనపై దాడి పాల్పడ్డారన్నారు. కార్యక్రమంలో పాండురంగ యాదవ్, వీవీ గౌడ్, నరసింహయాదవ్, స్వప్న, దేవర శివ, అంజన్న యాదవ్ పాల్గొన్నారు.

రాష్ట్ర కబడ్డీ జట్టుకు కెప్టెన్‌గా శ్రీకాంత్

ధన్వాడ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా ధన్వాడ మండలం బుడ్డమర్రితండాకు చెందిన శ్రీకాంత్ రాష్ట్ర స్థాయి కబడ్డీ జట్టుకు కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. ఈనెల 28 నుంచి జులై 1 వరకు ఉత్తరాఖండ్ రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో తెలంగాణ తరపున శ్రీకాంత్ సారథ్యం వహించనున్నాడు. జిల్లా యువజన సర్వీసుల శాఖ అధికారి వెంకటేష్, వ్యాయామ ఉపాధ్యాయులు అనంతసేన, బాలరాజు, సాయినాథ్, రామకృష్ణ, రవికూమార్, విష్ణు తదితరులు విద్యార్థిని అభినందించారు.

నేటి నుంచి రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్

» 22 జిల్లాల నుంచి 600 మంది క్రీడాకారులు
» టోర్నీని ప్రారంభించనున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి


జిల్లా కిక్‌బాక్సింగ్ క్రీడాకారులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లా స్పోర్ట్స్ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పసుల క్రిష్టారెడ్డి ఫంక్షన్‌హాల్‌లో శని, ఆదివారం రెండు రోజుల పాటు రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్ పోటీలు నిర్వహించనున్నారు. 7 ఏళ్ల నుంచి 45 ఏళ్ల వయస్సుల విభాగంలో పోటీలు జరగనున్నాయి. బాలికలకు మహబూబ్‌నగర్ హైస్కూల్, బాలురకు క్రీస్తుజ్యోతి, ఫాతిమా స్కూల్‌లో వసతి కల్పించనున్నారు. సాయంత్రం 4 గంటలకు మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించనున్నారు. రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు సంజీవ్ ముదిరాజ్, మిథున్‌రెడ్డి, కిక్ బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రామాంజనేయులు, మహిపాల్, కోశాధికారి శ్రీనివాస్ హాజరుకానున్నారని టోర్నీ ఆర్గనైజర్, జిల్లా అధ్యక్షుడు రవికుమార్ తెలిపారు.

టోర్నీని విజయవంతంగా నిర్వహిస్తాం..



రాష్ట్రస్థాయి కిక్‌బాక్సింగ్ పోటీలకు 22 జిల్లాల నుంచి 600పైగా క్రీడాకారులు పోటీల్లో పాల్గొంటారు. క్రీడాకారులు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశాం. రెండు రోజుల పాటు పోటీలు ఉంటాయి, టోర్నీని విజయవంతంగా నిర్వహిస్తాం.

- కె.రవికుమార్, కిక్ బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

రాష్ట్ర స్థాయి టోర్నీలో విజేతగా నిలవాలి

» జిల్లా ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షుడు ఎన్పీ వెంకటేశ్
» తరలిన జిల్లా ఫుట్‌బాల్ జట్టు


ఫుట్‌బాల్ క్రీడాకారులతో జిల్లా ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షుడు ఎన్పీ వెంకటేశ్ తదితరులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ టోర్నీలో జిల్లా జట్టు విజేతగా నిలవాలని ఉమ్మడి జిల్లా ఒలంపిక్ సంఘం అధ్యక్షుడు, జిల్లా ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షుడు ఎన్పీ వెంకటేశ్, డీవైఎస్‌వో శ్రీనివాస్ అన్నారు. నిజామాబాద్ జిల్లాలో నేటి నుంచి జూలై 1వ తేదీ వరకు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి బాలుర జూనియర్ ఫుట్‌బాల్ టోర్నీలో పాల్గొనే ఉమ్మడి జిల్లా జట్టు క్రీడాకారులు కే.వంశీకృష్ణ, కే.సాయితేజ, జీ.వంశీకృష్ణ, జే.వర్ధన్‌నాయక్, మహ్మద్ ఆమన్, జే.శివ, ఎం. రాఘవేందర్, బండి నవతేజ, సుబాహన్, కృపాదాస్, కే.చరణ్, ఖాజా మైనొద్దీన్, ఎం.చరణ్, అబ్దుల్‌మతీన్, అబ్రార్ షరీఫ్, అనస్‌ఖ్రా, కోచ్, మేనేజర్ ఎం.కళ్యాణ్, సామిల్ తరలివెళ్లారు. ఈ సందర్భంగా శుక్రవారం స్టేడియం మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి వారు పాల్గొని జట్టు క్రీడాకారులను అభినందించి, మాట్లాడారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, క్రీడాకారులకు బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు. జిల్లాలో ప్రతిభ గల క్రీడాకారులకు కొదవలేదని, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తున్నారని గుర్తుచేశారు. గుర్తింపు ఉన్న క్రీడలను ఎంపిక చేసుకోవాలని, క్రీడా కోటాలో ఉద్యోగ అవకాశాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్యాట్రన్ టీఎస్ రంగారావు, ప్రధాన కార్యదర్శి జీ.భానుకిరణ్, కోశాధికారి నగేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఇమ్మనుయ్యల్ జేమ్స్, నందకిశోర్, రమేష్, సూర్యప్రకాష్, రాజేందర్, ఫుట్‌బాల్ నికేష్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక


రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

గోపాల్‌పేట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీ లకు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. శనివారం నుంచి 30వ తేదీ వరకు నిజామాబాద్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి జూనియర్ బాలుర జట్టుకు వనపర్తి జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ వారు నిర్వహించిన ఎంపికల్లో పాఠశాల విద్యార్థులు ప్రశాంత్, బాబు నాయక్, సాయి, మణికంఠ, మహేష్, చరణ్ ఎంపికయ్యారని పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు సురేందర్‌రెడ్డి తెలిపారు. ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఎం రాందేవ్‌రెడ్డి, ఉపాధ్యా యుల అభినందించారు.

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు కొండాపూర్ విద్యార్థి


చరణ్‌నాయక్

ధన్వాడ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు నారాయణపేట జిల్లా ధన్వాడ మండలం కొండాపూర్ గురుకుల పాఠశాల విద్యార్థి చరణ్‌నాయక్ ఎంపికయ్యాడు. ఈనెల 20 నుంచి 26 వరకు మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో జరిగిన శిక్షణ శిబిరంలో విద్యార్థి పాల్గొని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈనెల 28 నుంచి జులై 1 వరకు నిజామాబాద్ జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో చరణ్‌నాయక్ పాల్గొననున్నారు. విద్యార్థి ఎంపికపై పాఠశాల ప్రిన్సిపాల్ రాజారాం, కోచ్ రాంమోహన్‌గౌడ్, పీఈటీ అంజనేయులు, వైస్ ప్రిన్సిపాల్ సాంబయ్యనాయక్ అభినందించారు.

ఇసుక రవాణాను అడ్డుకున్న గ్రామస్థులు


ఇసుక రవాణాపై పోలీసులతో మాట్లాడుతున్న గ్రామస్థులు

మాగనూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పేట జిల్లా మాగనూరు మండల కేంద్ర సమీపంలోని పెద్దవాగు నుంచి ఇసుకను తరలిస్తున్న వాహనాలను గ్రామస్థులు అడ్డుకున్నారు. రాఘవ కన్‌స్ట్రక్షన్ కంపెనీ వారు అనుమతి లేకుండా ఇసుకను టిప్పర్లలో తరలిస్తుండగా విషయం తెలుసుకున్న గ్రామస్థులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు వాగు వద్దకు చేరుకొని వాహనాలను అడ్డుకున్నారు. మాగనూరు పెద్ద వాగు నుంచి ఇసుకను తరలించేది లేదని గ్రామస్థులు పోలీసులు, అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఇసుకను తరలిస్తే ఊరుకోమంటూ తహసీల్దార్ నాగలక్ష్మికి వినతిపత్రం అందించారు. ప్రభుత్వం ఆన్‌లైన్ ద్వారా ఇసుకను తరలించడంతో ఇప్పటికే సాగునీటికి చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామస్థులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. గ్రామస్థుల వినతిపై తహసీల్దార్ ఉన్నతాధికారులకు ఫోన్‌లో సమాచారం ఇవ్వగా శివారులోని వాగు నుంచి ఇసుక రవాణా చేయాలని తెలుపడంతో గ్రామస్థులు శాంతించారు. కార్యక్రమంలో వాకిటి శ్రీనివాసులు, నరసింహారెడ్డి, ఇడిగి వెంకటేష్, చంద్రు, వివిధ పార్టీల నాయకులు, ఎస్‌ఐ అశోక్‌బాబు, హెడ్ కానిస్టేబుల్ అర్జున్, డీటీ సురేష్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

పాలిసెట్ కౌన్సెలింగ్ ప్రారంభం


ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న కౌన్సెలింగ్ చీఫ్ వెరిఫికేషన్ అఫీసర్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాములు

బిజినేపల్లి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : పాలిసెట్ అభ్యర్థులకు కౌన్సెలింగ్ ప్రారంభించినట్లు ఎస్వీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, కౌన్సెలింగ్ చీఫ్ వెరిఫికేషన్ ఆఫీసర్ డాక్టర్ పి.రాములు తెలిపారు. మండలంలోని పాలెంలోని ప్రభుత్వ ఎస్వీ అటానమస్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం పాలిసెట్ -2025 ప్రవేశ పరీక్ష రాసి అర్హత సాధించిన విద్యార్థులధ్రురవపత్రాలను పరిశీలించి ఆన్‌లైన్ నమోదు చేపట్టినట్లు తెలిపారు. పదవ తరగతి పాసై, పాలిసెట్ అర్హత సాధించిన విద్యార్థులు ఇంజనీరింగ్ డిప్లొమా విద్య అభ్యసించేందుకు స్లాట్ బుక్ చేసుకొని ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు రెండు జతల జిరాక్స్, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు వెంట తెచ్చుకోవాలన్నారు. ఈనెల 29 వరకు కౌన్సెలింగ్ ప్రక్రియ కొనసాగుతుందని, విద్యార్థులు స్లాట్ బుకింగ్ సమయంలో సూచించిన సమయంలో సర్టిఫికెట్లతో వెరిఫికేషన్‌కు రావాలని తెలిపారు. కౌన్సెలింగ్‌లో లైబ్రేరియన్ వర్కాల శ్రీనివాసులు, శివ, నాగరాజు, నాగలింగం, మనోజ్ కుమార్, యాదగిరి, బాలస్వామి, నగేష్, కురుమయ్య ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో బంగారు మైసమ్మకు బోనాల సమర్పణ


సిర్సవాడలో బంగారు మైసమ్మకు బోనాలు సమర్పించేందుకు తీసుకెళ్తున్న భక్తులు

తాడూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సిర్సవాడ గ్రామంలో శుక్రవారం బంగారు మైసమ్మ తల్లికి కురుమ యాదవులు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఉన్న కురుమ, యాదవులందరూ భక్తిశ్రద్ధలతో అలంకరించుకుని హనుమాన్ దేవాలయం నుంచి బయల్దేరి శివసత్తుల పూనకాలతో అమ్మవారికి బోనాలు తీసుకెళ్లి సమర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు.

పీయూలో త్వరలో నాల్గవ స్నాతకోత్సవం

పాలమూరు యూనివర్సిటీ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు యూనివర్సిటీ పరిధిలో ఉన్న పీజీ, డిగ్రీ కోర్సులలో 2022-23, 2023-24, 2024-25 విద్యా సంవత్సరాల్లో టాపర్‌గా నిలిచిన విద్యార్థులకు త్వరలో జరిగే 4వ స్నాతకోత్సవ కార్యక్రమంలో బంగారు పథకాలు అందజేస్తామని పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ కె.ప్రవీణ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫ్యాకల్టీ ఆఫ్ కామర్స్ ఆర్ట్స్, సోషల్ సైన్స్‌లో 21 మంది విద్యార్థులకు, ఫ్యాకల్టీ ఆఫ్ సైన్స్‌లో 27 మంది విద్యార్థులకు, ప్రొఫెషనల్ ఎంబీఏ, ఎంసీఏ, ఫార్మసీలో 14 మంది విద్యార్థులకు, ఫ్యాకల్టీ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో 9 మంది విద్యార్థులకు, యూజీ కోర్సులో 17 మంది విద్యార్థులకు బంగారు పథకాలు అందజేస్తామన్నారు. సంబంధించిన కళాశాలలకు బంగారు పతకాల లిస్టును పంపించామని, ఏవైన అభ్యంతరాలు ఉంటే నాలుగు రోజుల్లో సమాచారం ఇవ్వాలని ప్రిన్సిపాల్స్‌కు సూచించారు.

ఇంటర్వ్యూ..

సేంద్రియ వ్యవసాయంతో రైతులకు మేలు

- రవికుమార్, ఏవో



ఇటిక్యాల, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): సేంద్రియ వ్యవసాయంతో పంట భూములకు మేలు జరుగుతుందని, అలాగే దిగుబడి కూడా పెరుగుతుందని ఏవో రవికుమార్ అన్నారు.వ్యవసాయ భూముల్లో భూసారం కోల్పోయే వీలుండదని చెప్పారు. శుక్రవారం ఆయన ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో మరిన్ని విషయాలు వెల్లడించారు.

వానాకాలం పంటల సాగు ఎలా ఉంది?

మండలంలో ఈసారి అధికంగా 12,500 ఎకరాల్లో రైతులు పత్తిపంట సాగు చేశారు. మిరప, కంది పంటల సాగుపై రైతులు ఆసక్తి చూపలేదు.

మండలంలో ఎరువుల కొరత ఉందా?

వానాకాలం సాగుకు సంబంధించి మండలంలో ఇప్పటివరకు ఎరువుల కొరత లేదు.

రైతులందరికీ రైతు భరోసా అందినదా?

అర్హులైన రైతులకు వారి బ్యాంకు ఖాతాల్లో రైతుభరోసా నిధులు జమ అయ్యాయి. తమకు అందలేదు అంటూ ఎవరూ మాకు ఫిర్యాదు చేయలేదు.

పంటల సాగుపై రైతులకు మీరిచ్చే సలహాలు, సూచనలు?

పంట పొలాల్లో రైతులు ఎప్పుడూ ఒకే రకమైన పంట వేయరాదు. పంట మార్పిడి చేయడం, విత్తనశుద్ధి, భూసార పరీక్షలు తప్పకుండా పాటించాలి. ఎరువులు మోతాదుకు మించి వాడరాదు. ఇలా చేయకపోవడం వల్లే దిగుబడి రాక చాలామంది రైతులు నష్టపోతున్నారు. వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు తీసుకోవాలి.

న్యూస్ బాక్స్

బాధ్యతలు చేపట్టిన కమిషనర్

అలంపూరు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): అలంపూరు మునిసిపాలిటీ నూతన కమిషనర్‌గా కే.శ్రీనివాసులు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం మాట్లాడుతూ అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని, ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఇక్కడ పని చేసిన కమిషనర్ చంద్రశేఖర్‌రావు కొల్లాపూర్‌కు బదిలీ అయ్యారు.

మహాసభలను విజయవంతం చేయాలి

ఉండవల్లి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో జూలై 2న నిర్వహించే ఐఎఫ్‌టీయూ నాల్గవ మహాసభలను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి జమ్మిచేడు కార్తీక్ అన్నారు. మహాసభ పోస్టర్లను శుక్రవారం ఉండవల్లిలోని అంబేడ్కర్ చౌరస్తాలో నాయకులు విడుదల చేశారు. కార్యక్రమంలో మద్దిలేటి, సత్యన్న, నాగేశ్వరమ్మ, పద్మమ్మ, సంధ్యారాణి, సుధాకర్, సాములు ఉన్నారు.

కాలనీల్లో కనీస సౌకర్యాలు కల్పించాలి

అయిజ టౌన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): అయిజ మునిసిపాలిటీలోని ఎక్లాస్‌పురం రోడ్డు మార్గంలో ఉన్న కాలనీలో కనీస సౌకర్యాలు కరువయ్యాయని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం పార్టీ నాయకులతో కలిసి ఆయన కాలనీలో పర్యటించారు. మిషన్ భగీరథ పైప్‌లైన్, సీసీరోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పట్టణ కమిటీ అధ్యక్షుడు భగత్‌రెడ్డి, భీంసేన్‌రావు, ప్రదీప్‌స్వామి, లక్ష్మన్ గౌడు, నాగరాజు, ఓబుల్‌రెడ్డి, వీరయ్య ఆచారి, వీరేశ్‌గౌడు, నర్సింహులు ఉన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

వడ్డేపల్లి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, తడి, పొడిచెత్తను వేరు చేసి అందించాలని మునిసిపల్, మెప్మా సిబ్బంది ప్రజలకు సూచించారు. వందరోజుల కార్యాచరణలో భాగంగా శుక్రవారం పురపాలక సంఘం వడ్డేపల్లి పట్టణ పరిధిలో ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం పట్టణ పరిధిలోని ట్రేడ్ లెసెన్స్‌లు లేని వ్యాపారస్తులకు నోటీసులు అందజేశామని మునిసిపల్ అధికారులు తెలిపారు.

ధూపదీప నైవేద్య కమిటీ మెంబర్‌గా చక్రవర్తి ఆచార్యులు

అయిజ టౌన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): గద్వాల జిల్లా నుంచి ధూపదీప నైవేద్య కమిటీ మెంబర్‌గా అయిజకు చెందిన చక్రవర్తి ఆచార్యులు ఎంపికయ్యారు. ఈమేరకు రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ నుంచి శుక్రవారం ఉత్తర్వులు అందినట్లు తెలిపారు. కమిటీలో తనకు స్థానం కల్పించినందుకు దేవాదాయశాఖ మంత్రికి, ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు.

డయాలసిస్‌పై అప్రమత్తంగా ఉండాలి

గద్వాల న్యూటౌన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): డయాలసిస్‌పై ప్రతీ ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని పేషంట్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాం మేనేజర్ పవన్‌కుమార్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ పేషెంట్స్‌కు పేషెంట్స్ ఎడ్యుకేషనల్ ప్రోగ్రాంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డయాలసిస్ ఇన్‌చార్జి నరసింహ, క్లస్టర్ సిగ్మ తుల్లా ఉన్నారు.

కూలిన మేలచెరువు రోడ్డు వంతెన స్లాబ్

▸ గ్రామానికి నిలిచిన రాకపోకలు



మేలచెరువు గ్రామం శివారులో కూలిన పాటువాగు వంతెన స్లాబ్

గద్వాల, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మేలచెరువు గ్రామానికి వెళ్లే దారిలో వాగు నీళ్లు వెళ్లే వంతెనపై స్లాబ్ కొంతభాగం కూలిపోయింది. దీంతో ఆ దారిలో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. కొన్ని నెలల క్రితం కొంతభాగం కూలిన వంతెన స్లాబ్, శుక్రవారం మరింత కూలిపోవడంతో వాహనాలు, స్కూల్ బస్సుల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో గ్రామం నుంచి పాఠశాలలకు వెళ్లేందుకు స్కూల్ బస్సులు వీరాపురం మీదుగా పూడూర్ రోడ్డుకు వెళ్లి మేలచెరువు గ్రామానికి చేరుకుంటున్నాయి. ద్విచక్రవాహనాలకు మాత్రం ఎలాంటి ఇబ్బంది లేదు. గ్రామానికి మరో దారికూడా గతంలో ఉండేది.

కొన్నినెలల క్రితం ఓ రైతు ఇది తన పట్టా భూమి అంటూ రోడ్డును తీసి వేశారు. దీంతో ఈ గ్రామస్థులు గద్వాలకు వెళ్లిరావాలంటే ఒకే రోడ్డు ఉండటంతో ఇబ్బంది పడుతున్నారు. పంచాయతీ అధికారులు, మండల అధికారులు స్పందించి వంతెనకు త్వరగా మరమ్మతులు చేయించి, అందుబాటులోకి తేవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

నాణ్యమైన విత్తనాలతో మంచి దిగుబడి

● రాజోలి, వడ్డేపల్లిలో విత్తనాలు పంపిణీ చేసిన అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు



రాజోలిలో రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు

రాజోలి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన విత్తనాలతో రైతులు మంచి దిగుబడి సాధించవచ్చని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు అన్నారు. రాజోలిలోని రైతువేదిక భవనంలో శుక్రవారం మండల వ్యవసాయ శాఖ అధికారి సురేఖ ఆధ్వర్యంలో జాతీయ ఆహారభద్రత పథకంలో భాగంగా కంది, జొన్న పంట సాగుకు శాస్త్రవేత్తలు పరిశీలించి ఆమోదించిన విత్తనాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. శాస్త్రవేత్తలు పరిశీలించి, ఆమోదించిన విత్తనాలను రైతులు సాగు చేయడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని అన్నారు. విత్తనాలు 4కేజీలకు ఒక మినీ ప్యాకెట్‌గా రైతులకు అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాసులు, మాజీ సర్పంచులు సుగుణమ్మ, గోపాల్, హుసేన్, తహసీల్దార్ రామ్మోహన్, మండల వ్యవసాయ శాఖ అధికారి సురేఖ, ఏఈవోలు, రైతులు ఉన్నారు.

● వడ్డేపల్లిలో..

వడ్డేపల్లి : ప్రభుత్వం అందించే ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకుని రైతులు నాణ్యమైన విత్తనాలను పండించాలని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు సూచించారు. జాతీయ ఆహార భద్రత పథకం-2025లో భాగంగా శుక్రవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో వడ్డేపల్లి మండల మహిళా సమాఖ్య భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే రైతులకు ఉచితంగా కందివిత్తనాలు పంపణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సక్రియానాయక్, మండల వ్యవసాయ అధికారి రాధ, వ్యవసాయ విస్తరణ అధికారులు రవీందర్ రెడ్డి, విమల, చంద్రకళ, రామునాయక్, వినోద్‌కుమార్, వడ్డేపల్లి మండల రైతులు ఉన్నారు.

● పాఠశాలల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. శుక్రవారం వడ్డేపల్లి మండల మహిళా సమాఖ్య భవనంలో ఎంవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వడ్డేప్లి, రాజోలి మండలాల బాలల హక్కుల పరిరక్షణ వేదిక మండలస్థాయి రివ్యూ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంఈవో నర్సింహ హాజరై మాట్లాడారు. అనంతరం హాజరైన అలంపూర్ ఎమ్మెల్యే, రెండు మండలాల్లోని పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత, మౌలిక సదుపాయాలు, జూనియర్ కళాశాల మంజూరు చేయించాలని కోరుతూ బాలల హక్కుల పరిరక్షణవేదిక సభ్యులు వినతిపత్రం అందజేశారు. సమావేశంలో ఎంవీ ఫౌండేషన్ మండల కోఆర్డినేటర్ హనిమిరెడ్డి, సీఆర్‌పీఎఫ్ కన్వీనర్లు సుధాకర్, విక్రమసింహారెడ్డి, ప్రభుదాసు, కొంకల గొల్ల సుధాకర్, కోయిలదిన్నె శేఖర్, గొంగళ్ల దేవేంద్ర, సీఆర్‌పీఎఫ్ సభ్యులు పాల్గొన్నారు.

రైతులకు ఉచితంగా కంది విత్తనాలు పంపిణీ



రైతులకు కంది విత్తనాల ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల న్యూటౌన్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం జాతీయ ఆహార భద్రత పథకం 2025(ఎన్‌ఎఫ్‌ఎస్‌ఎం) ఆధ్వర్యంలో తృణ ధాన్యాలు అభివృద్ధిలో భాగంగా కంది విత్తనాలను రైతులకు ఉచితంగా ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి పంపిణీ చేశారు.

కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, నాయకులు నరేందర్‌రెడ్డి, గణేశ్, పాషా, జిల్లా వ్యవసాయ అధికారి సక్రియనాయక్, సహాయ వ్యవసాయ సంచాలకులు, అధికారులు ఉన్నారు.

ప్రాజెక్టులపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం

- బీఆర్‌ఎస్ రాష్ట్రనాయకుడు కురువ విజయ్‌కుమార్

గద్వాల, జూన్ 27(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టులపై నిర్లక్ష్యం చేయడంతోనే జూరాలలో గేట్ల రోప్స్ తెగిపోతున్నాయని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు డాక్టర్ కురువ విజయ్ కుమార్ ఒక ప్రకటనలో ఆరోపించారు. తెలంగాణలో సాగునీటి రంగానికి అత్యంత ప్రాధాన్యం ఇచ్చి సాగును బాగు చేసిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌దేనని వివరించారు. ఏడాదిన్నర పాలనలో కృష్ణానదిపై జరిగిన ప్రాజెక్టుల ప్రమాదాలు కాంగ్రెస్ నిర్లక్ష్య వైఖరికి నిదర్శనం అని విమర్శించారు. నల్గొండ జిల్లాలో సుంకిశాల రిటైనింగ్ వాల్ కుప్పకూలిపోయిందన్నారు. శ్రీశైలం ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ కూలిపోయి ఎనిమిది మంది సజీవ సమాధి అయ్యారని గుర్తుచేశారు. జూరాల ప్రాజెక్టుపై భారీ వాహనాలను అనుమతిస్తున్నారని ప్రత్యామ్నాయంగా మరో బ్రిడ్జి నిర్మాణం చేపట్టి ప్రాజెక్టును పరిరక్షించాలని ఆయన కోరారు.

భగీరథ అధికారులు ఎక్కడ?

మానవపాడు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బీసీ కాలనీలో తాగునీటికి రోజూ ఇబ్బందిపడుతున్నామని ఆ కాలనీకి చెందిన అయ్యన్న శుక్రవారం పంచాయతీ కార్యదర్శి శివశంకర్‌కు వినతిపత్రం అందించారు. ఎన్నోమార్లు మిషన్ భగీరథ అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేదని, నామమాత్రంగా కాలనీలోకి వచ్చి సమస్య పరిష్కరించకుండా వెళ్తున్నారని అన్నారు. తాగునీటి సమస్యపై స్పందించాలని ఫోన్‌లో ఎన్నిమార్లు ప్రయత్నించినా ప్రయోజనం లేదని, ఉన్నతాధికారుల స్పందించి సమస్య పరిష్కరించాలని కోరారు.

మట్టి తరలింపు నిలిపివేత

మండల పరిధిలోని పల్లెపాడులో అక్రమంగా మట్టి తరలిస్తున్నారని గ్రామస్థులు అడ్డుకున్నారు. శుక్రవారం పాతపల్లెపాడు నుంచి కొత్త పల్లెపాడులోకి మట్టిని అనుమతి లేకుండా తరలిస్తున్నారని, అనుమతులు తీసుకుని మట్టి తరలించాలని, అక్రమంగా మట్టి తరలిస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేస్తామని చెప్పడంతో మట్టి తరలింపు నిలిపివేసినట్లు గ్రామస్థులు తెలిపారు.

తిరుమలలో తుపత్రాళ్ల భజన బృందం

అయిజ టౌన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): అయిజ మునిసిపాలిటీలోని తుపత్రాళ్ల గ్రామ భజన బృందం శుక్రవారం తిరుమలలో పాల్గొంది. తిరుమల తిరుపతిలో నిర్వహిస్తున్నటువంటి అఖండ హరినామ సంకీర్తనలో భాగంగా వారు భజనలో పాల్గొని భక్తిగీతాలు ఆలపించారు. ఈ సందర్భంగా తిరుమల ఆలయ కమిటి వారు తుపత్రాళ్ల భజన బృందం సభ్యులు చిన్న వెంకటన్న, అశోక్, కుమార్‌గౌడు, హనుమంతు, రామాంజనేయులు గౌడు, వృద్ధ అశోక్ కుమార్ గౌడు, వీరేందర్, మధు. వీరేశ్‌ను శాలువాతో సన్మానించి, వేంకటేశ్వరస్వామి వారి తీర్థప్రసాదాలు అందజేసినట్లు తెలిపారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

ఉండవల్లి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే వైద్య శిబిరాల్లో ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని డాక్టర్ మల్లికార్జున్ రెడ్డి సూచించారు. ఆరోగ్యంపట్ల నిర్లక్ష్యం వహించకుండా ఎప్పకప్పుడు వైద్య పరీక్షలు చేయించుకుని మందులు వాడాలన్నారు. భవిష్య భారత్ స్వచ్ఛంద సంస్థ, ఎస్‌బీఐ సంజీవని ఆధ్వర్యంలో శుక్రవారం ఉండవల్లి మండల బొంకూర్‌లో మెగా హెల్త్ క్యాంపు, టీబీ ముక్త్ భారత్ అభిమాన్ కార్యక్రమంలో నిర్వహించారు. కార్యక్రమంలో మానవపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, బొంకూర్ పంచాయతీ కార్యదర్శి, ఆశా వర్కర్లు ఉన్నారు.

పోలీసుల అదుపులో కార్మికులు

ఉండవల్లి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఖైరతాబాద్‌కు తరలివెళుతున్న గ్రామపంచాయతీ కార్మికులను అదుపులోకి తీసుకున్నామని ఉండవల్లి ఎస్‌ఐ శేఖర్ శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఆందోళన చేసే యత్నంలో ఎలాంటి అవాంఛనీయమైన సంఘటనలు చోటుచేసుకోకుండా కార్మికులను అరెస్టు చేసి వారిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశామన్నారు.

వాసవీ మాతకు గోరింటాకు అలంకారం

గద్వాల టౌన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఆషాఢమాసం తొలి శుక్రవారం పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో వాసవీ మాతను మహిళలు గోరింటాకుతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతీ శుక్రవారం వాసవీమాతను విభిన్న రూపాల్లో అలంకరించి ప్రత్యేక పూజలు, కుంకుమార్చన చేయడం ఆనవాయితీ. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో తరలివచ్చిన ఆర్యవైశ్య మహిళలు అమ్మవారి పేరు సామూహిక కుంకుమార్చన నిర్వహించారు.

పాలిసెట్ కౌన్సెలింగ్ ప్రారంభం

గద్వాల టౌన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని గోనుపాడు వద్ద గల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించిన అడ్మిషన్ల కౌన్సెలింగ్ శుక్రవారం ప్రారంభమైంది. తొలిరోజు 300మంది విద్యార్థుల దరఖాస్తులకు ధ్రువపత్రాల పరిశీలన పూర్తయినట్లు ప్రిన్సిపాల్, పాలిసెట్ జిల్లా కోఆర్డినేటర్ రామ్మోహన్ తెలిపారు. కౌన్సెలింగ్ ఈనెల 28, 29వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు.

'కృష్ణవేణి పాఠశాల అనుమతులు రద్దు చేయాలి'

గద్వాల టౌన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి నాయకులపై దాడికి పాల్పడిన అయిజ కృష్ణవేణి పాఠశాల అనుమతిని రద్దు చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. అయిజలోని కృష్ణవేణి హైస్కూల్ వద్ద పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు దానయ్య, కార్యదర్శి హరీశ్‌పై పాఠశాల స్కూల్ బస్సు డ్రైవర్లతో దాడి చేయించడం గర్హనీయమన్నారు. దాడి ఘటనపై శుక్రవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో పలువిద్యార్థి సంఘాల నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ కురువ పల్లయ్య మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉద్దేశ పూర్వకంగా అలసత్వం ప్రదర్శిస్తున్న అయిజ ఎంఈవోను విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే విద్యార్థి సంఘాలతో ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామన్నారు. సమావేశంలో పీడీఎస్‌యూ, బీఆర్‌ఎస్వీ, యూఎస్‌ఎఫ్‌ఐ, టీఎన్‌ఎస్‌ఎఫ్, ఏఐఎస్‌ఎఫ్, ఎంఎస్‌ఎఫ్ నాయకులు హలీం పాషా, మాల మల్లికార్జున్, రంగస్వామి, సుభాన్, ప్రవీణ్, మహేష్ ఉన్నారు.

తీరుమార్చుకోని ఆర్టీసీ అద్దెబస్సు డ్రైవర్



ప్రయాణికుడిని దుషిస్తున్న డ్రైవర్

గద్వాల అర్బన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): గద్వాల డిపోకు చెందిన అద్దెబస్సు (టీఎస్33 టి - 3434) డ్రైవర్ దురుసు ప్రవర్తన మరోసారి వివాదాస్పదమైంది. శుక్రవారం ఉదయం గద్వాల నుంచి అయిజ వెళ్తున్న ఈ బస్సు ఎక్కేందుకు స్థానిక గంజ్‌సర్కిల్ వద్ద నిలిచి ఉన్న ప్రయాణికుడు బస్సును ఆపాలని కోరినా, డ్రైవర్ ఆపకుండా వెళ్లాడు. దీంతో అటువైపే వెళుతున్న టూవీలర్ ఎక్కి కొద్దిదూరం వెళ్లాక బస్సును రోడ్డుపై నిలిపి బస్సులోకి ఎక్కాడు. ఆపకుండా వెళ్లడంపై డ్రైవర్‌ను సదరు ప్రయాణికులు ప్రశ్నించడంతో ఒక్కసారిగా ఆగ్రహంతో డ్రైవర్ అసభ్య పదజాలంతో దుషించడం మొదలుపెట్టాడు. ఇది ఆర్టీసీ బస్సు కాదు, నా సొంత బస్సు ఇష్టముంటే ఎక్కు, లేకపోతే దిగి వెళ్లు అంటూ దబాయించాడు. బస్సును కొద్దిసేపు నిలిపివేయడంతో ప్రయాణికులు ఇబ్బందిపడ్డారు. గతంలోనే ఈ డ్రైవర్ అనేకసార్లు ప్రయాణికులతో దురుసుగా ప్రవర్తించినట్లు డిపో అధికారులకు ఫిర్యాదు అందినా చర్యలు తీసుకోలేదని పలువురు తెలిపారు. ఇప్పటికైనా డిపో అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయానికులు కోరుతున్నారు.

విత్తన పత్తి రైతులకు న్యాయం చేయండి

● కలెక్టర్‌కు పోరాట సమితి నాయకుల వినతి



కలెక్టర్ బీఎం సంతోష్‌కు వినతిపత్రం ఇస్తున్న పోరాట సమితి నాయకులు

గద్వాలటౌన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సీడ్ పత్తి సాగు చేస్తున్న రైతులకు సరైన న్యాయం జరిగేలా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ రంజిత్‌కుమార్ కోరారు, రైతులు, పోరాట సమితి నాయకులతో కలిసి శుక్రవారం కలెక్టర్ బీఎం సంతోష్‌కు వినతిపత్రం ఇచ్చారు. చట్టప్రకారం జీవోటీ ఫలితాల్లో పూర్తి బాధ్యత వహించాల్సింది కంపెనీలదేనని, ఫెయిల్ అయిన వాటికి నష్టపరిహారం చెల్లించాలని కోరారు. దశాబ్దాల తరబడి నాణ్యమైన సీడ్ పత్తిని సాగుచేస్తున్న రైతులకు దళారులు, కంపెనీలు కుమ్మక్కై అడుగడుగునా చేస్తున్న మోసాన్ని కలెక్టర్‌కు వివరించారు. గత ఏడాది పండించిన సీడ్‌కు సైతం ఇప్పటివరకు చెల్లింపు జరపకుండా వేధిస్తున్నట్లు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. నాణ్యత ఉండి ఉత్తీర్ణత పొందిన విత్తనాలను సైతం ఫెయిల్ అయ్యాయంటూ రైతులను మోసగించి వారిపై అప్పుల భారం మోపడమేగాన అనేక మంది రైతుల వద్ద ఆర్గనైజర్లు భూములు లాక్కున్నారన్నారు. రైతులకు, కూలీలకు ఉపాధి కల్పిస్తున్నామంటూ వారిని నమ్మించి తాము మాత్రం కోట్లు గడిస్తున్న ఆర్గనైజర్లు రైతులను మాత్రం నిండా ముంచుతున్నారన్నారు. నూతన విత్తన చట్టం ద్వారా రైతులకు న్యాయం జరిగేలా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం మాట్లాడిన రంజిత్‌కుమార్, ఆర్గనైజర్లు, కంపెనీల మోసాలకు జిల్లా అధికారులు అడ్డుకట్ట వేయకపోతే రైతులతో కలిసి రాష్ట్ర రాజధాని వరకు పాదయాత్ర చేపట్టి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తెస్తామన్నారు. కార్యక్రమంలో పోరాట సమితి కన్వీనర్ బుచ్చిబాబు, వెంకట్రాములు, జమ్మన్న, గౌని శ్రీనివాస్‌యాదవ్, బలరాంనాయుడు, విష్ణు, మునెప్ప, దయాకర్, గోపాల్, అమరేష్, దొడ్డన్న, సురేష్, ఆశన్న, బంగి పరుశ, కృష్ణ, సామియేల్ ఉన్నారు.

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

▸ పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎస్పీ, డీఎస్పీ



పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎస్పీ, డీఎస్పీ తదితరులు

గద్వాలక్రైం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): యువత, విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా ఉన్నత లక్ష్యాసాధనకు కృషి చేయాలని ఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నివారణ అవగాహన వారోత్సవాల్లో భాగంగా జిల్లా ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం ఎస్పీ నివారణ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే అనారోగ్య సమస్యలు, ఆర్థిక, సామాజిక దుష్పరిణామాలపై జిల్లా పోలీస్ శాఖ తరపున నిత్యం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ మొగులయ్య, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర్‌రెడ్డి, సీఐలు, గద్వాల, శాంతినగర్ సీఐలు శ్రీను, టాటాబాబు, ఆర్ఐ వెంకటేశ్ ఉన్నారు.

● బానిసలు కావొద్దు

గట్టు : మత్తు పదార్థాలకు యువత బానిస కావొద్దని మల్దకల్ ప్రాజెక్టు సీడీపీవో హేమలత సూచించారు. శుక్రవారం అధికారులతో కలిసి గట్టు తహసీల్దార్ కార్యాలయం ఎదుట మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీసీసీబీ బ్యాంకు మేనేజరు ప్రదీప్‌కుమార్, నయాబ్ తహసీల్దార్ విజయ్‌కుమార్, సూపర్‌వైజర్ సంధ్యారాణి, జూనియర్ అసిస్టెంట్లు వజ్రమ్మ, జయలక్ష్మి, గణేశ్, భరణి, గోపాల్ అంగన్వాడీ టీచర్ వెంకట్రామమ్మ పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

● నేర సమీక్ష సమావేశంలో ఎస్పీ

విధి నిర్వహణలో పోలీసులు తీరు ప్రభావవంతంగా ఉండాలని ఎస్పీ శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో పోలీస్ అధికారులతో నెలవారి సమీక్ష సమావేశం నిర్వహించారు. త్వరలోనే లోకల్ బాడీ ఎన్నికలు జరిగే అవకాశం ఉన్నందున గ్రామ పోలీస్ అధికారులు పకడ్బందీగా పని చేయాలని చెప్పారు. శాంతిభద్రతల విషయంలో ముందస్తు సమాచారం సేకరించి సమస్యలు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. ఫంక్షన్ వర్టికల్‌లో ఎవరికి కేటాయించిన విధులు వారు అప్‌డేట్ చేస్తూ మెరుగుపర్చుకోవాలన్నారు. సమావేశంలో డీఎస్పీ మొగులయ్య, సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ సత్తయ్య, ఎస్బీ సీఐ నాగేశ్వర్‌రెడ్డి, గద్వాల, అలంపూర్, శాంతినగర్ సీఐలు, ఎస్ఐలు ఉన్నారు.

పుస్తకాల విక్రయంపై ముదురుతున్న వివాదం



ఓ ప్రైవేటు పాఠశాల వద్ద ప్రైవేటు బస్సు డ్రైవర్లు, విద్యార్థి సంఘం నాయకుల మధ్య వాగ్వాదం

అయిజ టౌన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): అయిజ పట్టణంలోని ప్రైవేటు పాఠశాలల్లో విక్రయిస్తున్న పుస్తకాల విక్రయాల వివాదం రోజురోజుకూ ముదురుతున్నది. విద్యార్థి సంఘాల ఆందోళనతో ప్రైవేటు పాఠశాలల్లో పుస్తక విక్రయ కేంద్రాలను అధికారులు సీజ్ చేశారు. తీవ్ర వాగ్వాదాల మధ్య ఈ ఘటన శుక్రవారం పోలీస్ స్టేషన్‌కు చేరింది. పట్టణంలోని మరో ప్రైవేటు పాఠశాల వారు ఓ ప్రైవేటు దుకాణంలో పుస్తకాలను విక్రయిస్తున్నారన్న సమాచారంతో శుక్రవారం విద్యార్థి సంఘాల నాయకులు అక్కడికి చేరుకున్నారు. విషయాన్ని ఎంఈవో దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో కార్యాలయ సిబ్బందిని పంపిన ఎంఈవో, కొంత సమయం తర్వాత అక్కడికి చేరుకున్నారు. పాఠశాల యాజమాన్యంతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ క్రమంలోనే కృష్ణవేణి పాఠశాల బస్సు డ్రైవర్లు కొందరు అక్కడికి వచ్చి మేము తాగి వాహనాలు నడుపుతున్నట్లు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. మీ వద్ద ఆధారాలు ఉన్నాయా? అని విద్యార్థి సంఘాల నాయకులను ప్రశ్నించారు. ఈ క్రమంలో తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. అసభ్యకరమైన పదజాలంతో ఒకరిపై ఒకరు చేయి చేసుకునే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఎంఈవో కార్యాలయ సిబ్బంది సర్దిచెప్పటంతో వివాదం సద్దుమణిగింది. తమపై పాఠశాల యాజమాన్యాలు దాడులకు ప్రోత్సహిస్తున్నాయని పోలీసులకు ఫిర్యాదు చేశామని ప్రగతిశీల విద్యార్థి యువజన సంఘం జిల్లా కార్యదర్శి హరీశ్ తెలిపారు.

పంచాయతీ కార్మికుల ముందస్తు అరెస్టు

● తీవ్రంగా ఖండించిన సీఐటీయూ మండల కార్యదర్శి లక్ష్మన్న

రాజోలి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన ఛలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్తున్న పంచాయతీ కార్మికులను రాజోలి పోలీసులు ముందస్తుగా అరెస్టు చేయడంపై సీఐటీయూ మండల కార్యదర్శి లక్ష్మన్న, తీవ్రంగా ఖండించారు. శుక్రవారం పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లింపులు వెంటనే చేయాలని కోరుతూ హైదరాబాద్‌లో చేపట్టిన కార్యక్రమంకు వెళ్తున్న కార్మిక సిబ్బందిని ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన పోలీస్ స్టేషన్‌లో నిరసన కార్యక్రమం చేపట్టి మాట్లాడారు. తొమ్మిది నెలలుగా పెంచిన వేతనాలను ఇంతవరకు ఇవ్వకపోవడానికి గల కారణాలు ఏమిటని ప్రశ్నించారు. ఒకపూట తినీ తినకుండా పస్తులు ఉండి విధులు నిర్వర్తిస్తున్న పారిశుధ్య కార్మికులకు వేతనాలు ఇవ్వడం లేదని, కార్మికులు అన్నారు. కార్యక్రమంలో లక్ష్మన్న, రవి, సుందరాజు, దస్తగిరి, ఉమామహేష్, నరసన్న, పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై నాలుగు వాహనాలు ఢీ

మానవపాడు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జాతీయ రహదారి 44పై బోరవెల్లి స్టేజీ సమీపంలో శుక్రవారం రాత్రి వరుసగా నాలుగు వాహనాలు ఢీ కొన్నాయి. ఈ ఘటనపై హైవే సిబ్బంది తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్ నుంచి కర్నూల్ వెళ్తున్న జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న ఒక కారు అకస్మాత్తుగా బ్రేక్ వేయడం తో వెనుక వస్తున్న లారీ ఢీకొనగా ఆ లారీని మరో లారీ ఢీకొట్టింది.

అదేవైపుగా వస్తున్న మరో కారు లారీని ఢీకొట్టింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

నిబంధనల ప్రకారం ఇళ్లు నిర్మించాలి



మానవపాడులో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీవో భాస్కర్

మానవపాడు, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శుక్రవారం ఎంపీడీవో భాస్కర్ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇంటి నిర్మాణంపై పలుసూచనలు ఇచ్చారు. ప్రతీ లబ్ధిదారుడు ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారమే నిర్మించాలని చెప్పారు. కొలతలు లేకుండా ఇష్టానుసారంగా నిర్మాణం చేస్తే బిల్లు నిలిచిపోతుందని హెచ్చరించారు. నిబంధన ప్రకారం నిర్మించుకున్నవారికి నాలుగు విడతల్లో డబ్బులు ఖాతాలో జమ అవుతాయని చెప్పారు. పరిశీలనలో పంచాయతీ కార్యదర్శి శివశంకర్, గ్రామ నాయకులు ఉన్నారు.